ప్రజాశక్తి

శనివారం 29 ఏప్రిల్ 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల





తాగునీటి సమస్య తలెత్తకుండా

ముందస్తు చర్యలు

- పది రోజులు గ్రామాల్లో పర్యటించాలి
- అధికారులకు కలెక్టర్ రంజిత్‌బాషా ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వేసవిలో జిల్లా ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులపై సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో శుక్రవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంజినీరింగ్ అధికారులు పది రోజుల పాటు అన్ని గ్రామాలలో పర్యటించి.. తాగునీటి సమస్యలు గుర్తించి తక్షణమే పరిష్కారమార్గం చూపాలన్నారు. పైపులైను లీకేజీలు, అందుబాటులో లేని నీటి వనరుల సమస్యలన్నింటినీ గుర్తించి నివేదిక ఇవ్వాలన్నారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఉండరాదని, నీటి ఎద్దడి రాకుండా జాగ్రత్త పడాలన్నారు. జలజీవన్ మిషన్ కింద ప్రభుత్వం మంజూరు చేసిన పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. జిల్లాకు 723 పనులు మంజూరు కాగా పూర్తిస్థాయిలో ప్రారంభం కాకపోవడంపై మండలాలవారీగా సమీక్షించారు. మండలస్థాయి అధికారులు 10 రోజులకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పనిచేయాలని మార్గనిర్దేశం చేశారు. నిర్లిప్తంగా విధులు నిర్వహిస్తే సహించేది లేదన్నారు. జె.పంగులూరు మండలంలో 13 పనులు పెండింగ్‌లో ఉండగా, కొరిశపాడులో 17, సంతమాగులూరులో 10, బాపట్లలో 22, కర్లపాలెంలో 18, చీరాలలో 36, చినగంజాంలో 32, ఇంకొల్లులో 14, మార్టూరులో 19, నగరంలో 46 పనులు పెండింగ్ ఉండడంపై ఆరాతీశారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు గడువులోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. సామాజిక మరుగుదొడ్ల భవన నిర్మాణాలు జిల్లాకు 406 మంజూరు కాగా 48 పనులు ప్రారంభం కాకపోవడంపై అధికారులను నిలదీశారు. 41 పనులు పునాది స్థాయికి దిగువన ఉండటం ఏమిటని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా ▶ 2లో

ఇంటర్ విద్యార్థుల్లో ఆందోళన

- ఉత్తీర్ణత శాతం పడిపోవడంతో ఉన్నత చదువులకు ఆటంకం
- 6 కార్పొరేట్ కాలేజీల్లోనూ 30 శాతం వరకూ ఫెయిల్
- 61 శాతం ఉత్తీర్ణత మించని ప్రభుత్వ కాలేజీలు
- కొన్ని కాలేజీల్లో 30 శాతం మాత్రమే నమోదు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఇంటర్ విద్య ఫలితాలు విద్యార్థుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. ఏడాది పొడవునా రాత్రింబవళ్లు కష్టపడి చదివినా కనీసం పాసవ్వని విద్యార్థులు భారీ సంఖ్యలో ఉంటున్నారు. ఇది ఉన్నత చదువులకు ఆటంకంగా మారుతోంది. ఇందులోనూ మంచి మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య చూస్తే వందకు పది మంది కూడా కనిపించడం లేదు. ఈ ఏడాది ఇంటర్ ఫలితాలు చూస్తే మరింత ఆందోళనకరంగా ఉన్నాయి. పిల్లల భవిష్యత్‌పై తల్లిదండ్రుల్లోనూ కలవరం మొదలైంది. ఇదే తీరున మార్కులు వస్తే రానున్న కాలంలో ఉద్యోగాలు ఎలా వస్తాయని కలత చెందుతున్నారు.

కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లాడు పాసైతే చాలనుకునే పరిస్థితి కూడా వచ్చింది. ఎందుకంటే ఫలితాలకు, చదువులకు పొంతన లేదు. భారీగా ఫీజులు కట్టిన కార్పొరేట్ కాలేజీల్లోనూ 30 శాతం మందికిపైగా ఫెయిలయ్యారంటే ఆశ్చర్యం కలుగుతోంది. చెప్పే పాఠాలకు, పరీక్షా పత్రాలకు పొంతన ఉండటం లేదు. ప్రభుత్వం ఇచ్చిన పాఠ్యపుస్తకాలకు పరిమితం కావడం లేదు. ఇతర పుస్తకాలను కూడా జోడించి ఐఐటీ, ఎంసెట్ ఇలా అనేక ప్రవేశపరీక్షలకు కూడా చెబుతున్నారు. వాస్తవానికి ప్రైవేటు సంస్థల్లో ఇంటర్ పాఠాలు మాత్రమే చెప్పడం లేదు. ఐఐటీ, ఎంసెట్ పేరుతోనే పాఠాలు చెబుతారు. చివరి రెండు నెలల్లోనే ఇంటర్ చెబుతారు. ఎంతమంది ఐఐటీల్లో సీట్లు సంపాదిస్తున్నారన్నదే ప్రశ్న. దానికోసం ఏడాదంతా పోగొట్టుకుంటున్నారు. చివరికి ఇంటర్‌లో ఫెయిలవుతున్నారు. పాసైన విద్యార్థులు కూడా తక్కువ మార్కులతోనే ఎక్కువ సంఖ్యలో ఉంటున్నారు. 90 శాతం మార్కులు దాటిన విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఈ ఏడాది మొదటి సంవత్సరం ఇంటర్‌లో 51 శాతమే ఉత్తీర్ణులయ్యారు. 49 శాతం మందికి రెండో ఏడాదిలోనూ సబ్జెక్టులు మిగిలి వుంటాయి. అంటే ఇంకా భారం పడుతోంది. బాలురు 46 శాతం మాత్రమే పాసయ్యారు. అంటే 54 శాతం మంది తప్పారు. బాలికలు కూడా 44 శాతం మంది ఫెయిల్ అయ్యారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 70 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 30 శాతం మంది పరీక్షలో తప్పారు. ఇందులో బాలురు 65 శాతమే పాసయ్యారు. 50 వేల నుంచి లక్ష వరకు ఫీజులు వసూలు చేసే రెండు కార్పొరేట్ సంస్థల్లోనూ ఉత్తీర్ణత శాతం పడిపోయింది. చిన్నచిన్న ప్రైవేటు కాలేజీల విద్యార్థులకు అత్యధిక మార్కులు వచ్చాయి. ఇక ప్రభుత్వ కాలేజీల్లోనూ ఫలితాలు తగ్గాయి. 61 శాతం మించలేదు. 30 శాతం కూడా ఉత్తీర్ణత లేని కాలేజీలు ఉన్నాయి. కేజీబీల్లోనూ ఇదే పరిస్థితి. ఇక్కడా 61 శాతం మించలేదు. ఇంతమంది విద్యార్థులతకు కనీస మార్కులు కూడా రాలేదంటే ఇంటర్ విద్యపై చర్చ సాగాల్సి ఉంది. పరీక్షకు సంబంధం లేని చదువులు ప్రైవేటు సంస్థల్లో సాగుతున్నాయి. దీంతో ఈ సంస్థల్లో ఫలితాలు తగ్గాయి. ప్రభుత్వ కాలేజీల్లో ఎందుకు తగ్గాయనే కోణంలోనూ ఆలోచించాలి. ఇప్పుడు ఇంజనీరింగ్, ఇతర డిగ్రీలు చేరడానికి మళ్లీ సప్లిమెంటరీ రాయాలి. కనీసం ▶ 2లో

గ్రావెల్ తవ్వకాల కోసం

ఎవరికీ అనుమతులివ్వొద్దు

- పర్యావరణాన్ని పరిరక్షించాలి
- ప్రజాభిప్రాయ సేకరణలో బొబ్బేపల్లి గ్రామస్తులు..
- పర్యావరణానికి ఇబ్బందులు లేకుండా తవ్వుకోవచ్చన్న రాజుగారిపాలెం గ్రామస్తులు



ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి-మార్టూరు రూరల్

గ్రావెల్ తవ్వకాలు నిర్వహించడానికి మైనింగ్ అనుమతుల కోసం ఓ సంస్థ దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో శుక్రవారం రాత్రి జిల్లా అధికారులు నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఎవరికీ ఇవ్వొద్దని, పర్యావరణాన్ని పరిరక్షించాలని బొబ్బేపల్లి గ్రామస్తులు కోరారు. మండలంలోని బొబ్బేపల్లి, రాజుగారిపాలెం గ్రామాల పరిధిలోని సర్వే నెంబర్ 387/సి 11లో గ్రావెల్ తవ్వకాల కోసం ఐ ఫీచర్ లిమిటెడ్ అనే సంస్థ దరఖాస్తు చేసుకుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ చామకూరి శ్రీధర్ బొబ్బేపల్లి గ్రామంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. అందులో భాగంగా గ్రామస్తులు సుమారు 70 మంది పాల్గొన్నారు. అధికారులు గ్రామస్తులను చేతులెత్తి తమ అభిప్రాయం తెలపాలని కోరగా బొబ్బేపల్లి గ్రామానికి చెందిన మెజారిటీ వ్యక్తులు ప్రస్తుతం దరఖాస్తు చేసిన సంస్థకే కాకుండా గతంలో అనుమతులు మంజూరు చేసిన గ్రావెల్ సంస్థలకు కూడా ఇచ్చిన అనుమతులు రద్దు చేసి.. పర్యావరణాన్ని కాపాడాలని జేసీకి విన్నవించారు. రాజుగారిపాలెం గ్రామానికి చెందిన వ్యక్తులు మాత్రం అభివద్ధి కోసం, రోడ్డు కోసం గ్రావెల్ తవ్వకాలు అవసరమే కనుక పర్యావరణానికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా తవ్వకాలు జరిపితే తమకు ఎలాంటి ఇబ్బందీ లేదని తెలిపారు. ఈ క్రమంలో జేసి శ్రీధర్, బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయాన్ని నివేదిక రూపంలో కాలుష్య నియంత్రణ మండలికి, మైనింగ్, ఇతర సంబంధిత శాఖలకు పంపిన అనంతరం వివరాలు తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పర్యావరణ శాఖ ఇంజనీర్ జి.నాగిరెడ్డి, మార్టూరు తహశీల్దార్ బత్తుల వెంకటరెడ్డి, మండల సర్వేయర్ ఏడుకొండలు, ఆర్ఐ రహమాన్‌బాషా, రెవెన్యూ సిబ్బంది, రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి మల్లికగర్గ్

చోరీ కేసులో నిందితులు అరెస్టు

- రూ.34.50 లక్షల సొత్తు స్వాధీనం
- ఎస్‌పి మల్లికగర్గ్ వెల్లడి

3లో ▲

'సమంత' గుడి ప్రారంభం



ప్రముఖ సినీ నటి సమంతకు తాను కట్టిన గుడిని బాపట్ల జిల్లా, చుండూరు మండలం, ఆలపాడులో ఆమె వీరాభిమాని సందీప్ శుక్రవారం ఆమె పుట్టిన రోజు సందర్భంగా ప్రారంభించారు.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా

తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

అవసరాలను దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులు వేగంగా చేపట్టాలన్నారు. జగనన్న లేఅవుట్లలో భూమి చదును చేసే పనులు పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ప్రాధాన్యతను గుర్తించి అధికారులు పనిచేయాలన్నారు. అమర్తలూరు మండలంలో 37 పనులు మంజూరు కాగా, 31 పనులు ప్రారంభం కాకపోవడంతో పి.ఆర్. ఇంజినీర్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల మంజూరు, టెండరు దశలో ఉన్నవి, ప్రారంభమైన పనుల వివరాలు సంబంధిత ఏ.ఇ. చెప్పలేకపోవడంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. భట్టిప్రోలులో 42 పనులు మంజూరైనప్పటికీ పురోగతి లేకపోవడం, కొల్లూరులో 12 పెండింగ్‌లో ఉండటం, చుండూరులో 25 పనులు పెండింగ్ లో ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గడపగడపకూ మన ప్రభుత్వం పనులు 100 పెండింగ్లో ఉండటంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గ్రామ సచివాలయాలు, ఆర్.బి.కె.లు., వై.ఎస్.ఆర్. హెల్త్ క్లినిక్ భవనాల నిర్మాణ పనులలో పురోగతి లేకపోతే సహించేది లేదని కలెక్టర్ హెచ్చరించారు. భవన నిర్మాణాలకు రెండేళ్ళ క్రితం ఉపాధిహామి పథకం కింద నిధులు కేటాయిస్తూ అధికారికంగా మంజూరు చేసినప్పటికీ పురోగతి ఎందుకు లేదని నిలదీశారు. పి.ఆర్. ఇంజినీర్లు తమ విధులు నిర్వహించ కుండా ఏం పనిచేస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. కొల్లూరు మండలంలో ఆరు సచివాలయ భవనాలు, రెండు రైతుభరోసా కేంద్రాల భవనాల నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంపై మండిపడ్డారు. విధుల నిర్లిప్తతపై షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎస్.ఇ.ని కలెక్టర్ ఆదేశించారు. మార్టూరు మండలంలో మూడు సచివాలయాలు, ఆరు ఆర్.బి.కె.లు, ఆరు వై.ఎస్.ఆర్. హెల్త్ క్లినిక్‌లు పెండింగ్‌లో ఉండడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు రూ.30 కోట్ల పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండటంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనుల పురోగతి లేనిచోట పి.ఆర్. ఎస్.ఇ., డ్వామా పి.డి., ఆర్‌డబ్ల్యుఎస్. ఎస్.ఇ.లు కమిటీగా ఏర్పడి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. తదుపరి సమావేశం నాటికి ప్రారంభం కాని భవనాలు జిల్లాలో ఉండరాదని హెచ్చరించారు. ఇంజినీర్లు నిబద్ధతతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఆర్.డబ్ల్యు.ఎస్. ఇన్చార్జి ఎస్.ఇ. విజయకుమార్, పి.ఆర్. ఎస్.ఇ. శ్రీనివాసులు, డ్వామా పీడీ వై. శంకరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ జడ్‌పిటిసి బాలిరెడ్డి మృతి

అర్ధవీడు : మండల పరిధిలోని చిన్న కందుకూరు గ్రామానికి చెందిన మాజీ జడ్‌పిటిసి సూరా బాలిరెడ్డి అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందాడు. ఈ విషయం గురించి తెలుసుకున్న గిద్దలూరు నియోజకవర్గ వైసిపి నాయకుడు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి బాలిరెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వెంకట రామిరెడ్డి, మాజీ ఎంపిపి రాజేశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిటిడి బోర్డు చైర్మన్ సుబ్బారెడ్డిని కలిసిన రఫి

కంభం రూరల్ : జిల్లా వక్ఫ్ బోర్డ్ మాజీ చైర్మన్ సయ్యద్ నజీర్ బాషా కుమారుడు, వైసిపి ఎన్ఆర్ఐ విభాగం సభ్యుడు సయ్యద్ రఫి టిటిడి బోర్డు చైర్మన్ వైవి. సుబ్బారెడ్డిని శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రఫి కంభం ముస్లిం మైనారిటీల సమస్యల గురించి సుబ్బారెడ్డికి వివరించి వినతిపత్రం అందించారు. దీంతో స్పందించి వైవి. సుబ్బారెడ్డి కంభం ముస్లిం సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు రఫి తెలిపారు.

ఇంటర్ విద్యార్థుల్లో ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

పాస్ మార్కులు వచ్చేలా కూడా చదువులు లేవనే చెప్పాలి. లోపం ఎక్కడుందో పరిశీలన చేయాలి. పాఠ్యాంశాలపైనా అధ్యయనం చేయాలి. పరీక్షాపత్రాల్లో ఉన్న ప్రశ్నలకు, చెప్పే చదువులతోనే ముడిపడి ఉన్నాయా? లేదా? అనే కోణంలోనూ పరిశీలన చేయాలి. ఇంటర్ కాలేజీల్లో ఏం జరుగుతుందో కూడా అధికారులు పరిశీలన చేయాలి. లోతుగా సమీక్ష చేయాల్సిన అవసరం ఉంది.

గృహ నిర్మాణాలపై సమీక్ష

ప్రజాశక్తి- కొత్తపట్నం

మండల ప్రజా పరిషత్ కార్యాల యంలో ఎంపిడిఒ సుజాత ఆధ్వర్యంలో గృహ నిర్మాణాలపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ జగనన్న కాలనీ లేఅవుట్ లబ్ధిదారులు గృహ నిర్మాణాలను త్వరిత గతిన పూర్తి చేసుకొనేలా అధికారులు అవగాహన కల్పించాలన్నారు. అందుకు అధికారుల సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ నాంచారు రెడ్డి, ఎపిఎం రజియా సుల్తానా, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఆశ , చింపిరయ్య , వెలుగు సిసిలు రామారావు , సుధాకర్, రమణ తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE: BAPATLA.
I.P. No: 5/2023.

Between:
Vinukonda Srinivasa Rao ....Petitioner.
V/s
Velpuri Srinivasa Rao & 8 others
......Respondents.

TO,
1) Velpuri Srinivasa Rao S/o Raghavulu, R/o Gitanjali ladies tailor, Bapatla town& mandal.
2) Dasari Sarada W/o Srinivasa Rao R/o Nandiraju thota,Bapatla town& mandal.
3) Ambati Venkata Narayana Rao, S/o (late) Koteswara Rao, R/o Srungarapuram, Bapatla town & mandal.
4) Tanniru Gangadhar, S/o(late) Bala koteswara Rao, R/o:2nd line, Patel Nagar Bapatla town &mandal.
5)Mangalagiri Ravi Kumar, S/o Raghava Das, R/o 1st line, Asodivari palam road, Bapatla.
6)Sigireddy Siva Naga Raju, S/o Trimurthulu, R/o: new autonagar, Poranki ,Vijayawada.
7) Meka Sankar, S/o Veeraiah, R/o Municipal office road, Ongole.
8) Matcha Samuel Vijaya Kumar, S/o Prasad Rao, R/o Gandhipeta, Ramachandrapuram, Konasima (district).
9)Muppuri Subramanyam, S/o Venkata subba ratnam, R/o RTC colony, Guntur town & District ......Respondents.

పై నెంబరు పిటీషనులో పిటీషనరు రెస్పాండెంట్సు తాలూకు బాకీలను ఆర్థిక ఇబ్బందుల వల్ల చెల్లించకపోయినందున అతను I.P. పిటిషన్ దాఖలు చేసి ఉన్నాడు. సదరు పిటీషనర్ యొక్క స్థితి గతులను గురించి రెస్పాండెంట్స్ గాని ఇతరులు గాని తెలిసిన యెడల ది:2-5-2023న ఉదయం 10:30 గంటలకు స్వయంగా గాని లేక మీ వకీలు ద్వారా గాని మీ ఆక్షేపణలు ఏమైనా ఉన్న ఎడల పై కోర్టుకు హాజరై తెలియజేయగలరు. లేనియెడల మీ పరోక్షంగా శ్రీ కోర్టువారు తీర్మానించెదరని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేదీ:2-5-2023 ఇట్లు

కుర్రా రవి,
టి. రాఘవేంద్రనాథ్,
అడ్వకేట్స్, బాపట్ల.

మహారాజశ్రీ వినుకొండ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు
OS NO: 312/2020

Between:
పత్తి రాము .....Plaintiff
వర్సెస్
చందా కోటేశ్వరమ్మ మరియు ఇతరులు
.....Defendant

To
D2)చందా కోటేశ్వరరావు
తండ్రి (లేటు) నాగేశ్వరరావు మున్సిపల్ ఆఫీస్ దగ్గర, చీమకుర్తి గ్రామం. చీమకుర్తి పోస్ట్ మరియు పట్టణం, ప్రకాశం జిల్లా..

పై నంబరు దావా నందు ప్రతివాదివి అయిన నీకు శ్రీ కోర్టు వారు దావా సమన్లును పలుమార్లు కోర్టు ద్వారాను రిజిష్టరు పోస్టు ద్వారాను పంపినను తీసికొనక నీవు కాలయాపన చేయు చున్నందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ నోటీసు ద్వారా మీకు తెలియచేయునది. ఏమనగా ది.21-06-2023న ఉదయం 10:30 ని. లకు పై కోర్టువారు ఎదుట స్వయముగా గాని న్యాయవాది ద్వారా గాని హాజరయి పై నంబరు దావానందు మీకు గల అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని తెలియ పరుచుకొనగలరు. లేని యెడల పై నంబరు దావా మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలము గా మీకు తెలయచేయడమైనది.

// శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం //

వాయిదా తేది. 21-06-2023 ఇట్లు

యలవర్తి శ్రీనివాసరావు
న్యాయవాది & నోటరీ
వినుకొండ, కొత్తపేట,
సెల్ నెంబర్ 9440835056

మహారాజశ్రీ ఫ్యామిలీ జడ్జి (8 వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో) వారి కోర్టులో ఒంగోలు
OS NO 254/2014

కాకర్ల ఖాశింభి ... ప్లైయింటిఫ్
వర్సెస్
షేక్ మోదీనమ్మ మరియు 12 అదర్స్
...... డిఫెండెంట్స్

To
D13, లోకి రెడ్డి వేంకట సుబ్బారెడ్డి
తండ్రి చెన్నారెడ్డి హిందూ, వయస్సు 43సం. నివాసం, నాగ బొట్ల వారి పాలెం గ్రామం, తాళ్లూరు మండలం, ప్రకాశం జిల్లా,

పై OS No: 254/2014 లో మీరూ 13 వ ప్రతివాది అయి ఉన్నారు మీకు ఎన్ని సార్లు నోటీసు లు పంపుచున్ననూ.మీరు తీసుకునక తిప్పి పంపుచున్నారు పై కోర్టు వారి ఉత్తర్వుల మేరకు తేదీ 10.05.2023 న ఉదయం 10 గంటల 30 నిమిషాలకు మీరు స్వయంగా గాని మీ వకీలు ద్వారా గాని పై కోర్టు యందు హాజరుకావలెను లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును

// కోర్టువారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
తోటరాగ సుధారాణి.
కాటుకూరి సంపత్ కుమార్.
న్యాయవాదులు
జిల్లా కోర్టు ఆవరణ, ఒంగోలు
Cell.9885224292

మహారాజశ్రీ కందుకూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 5 /2011

1. మునగాల వెంకటేశ్వర రెడ్డి (డైడ్) & వగైరా - పిటీషనర్లు / వాదులు
వర్సెస్
1.నలమల్లు @ నల్లమల మాలకొండయ్య (డైడ్) & వగైరా - రెస్పాండెంట్స్ / ప్రతివాదులు

టు,
కోడూరి కొండమ్మ,
W/o **కోడూరి నాగిరెడ్డి** (R26), తాళ్లూరు గ్రామం, కనిగిరి మండలం, ప్రకాశం డిస్ట్రిక్ట్.

పై నెంబర్ పిటీషన్ లో మీరు ప్రతివాది అయిన మీరు పైకోర్టు నుండి అనేక సార్లు పిటీషన్ నోటీసులు పంపినను మీరు తీసుకోనందున శ్రీ కోర్టు వారు ఈ నోటీసును పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియ చేయమని ఉత్తర్వులు వేసి, పై నెంబర్ పిటీషన్‌ను **తేది: 01-05-2023** కి వాయిదా వేసివున్నారు. **కావున ఆ దినము ఉదయం గం॥ 10-30 ని॥లకు** పై కోర్ట్ వారి ఎదుట మీరు స్వయంగా గాని లేక మీ వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున విచారించి తీర్మానించెదరు.

వాయిదా తేదీ: 01-05-2023

(కోర్ట్ వారి ఉత్తర్వుల మేరకు)

ఇట్లు
చిడిపోతు హరికృష్ణ
న్యాయవాది, కందుకూరు

IN THE COURT OF THE HON'BLE XXVII ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: SECUNDERABAD
O.P.No. 618 OF 2020

Between:
P. Swathi and another
...Petitioners
AND
Thuraka Madhava and others
...Respondents

To,
R-1: Thuraka Madhava, S/o.Mahalakshmaiah, Aged: Major, Occ: Driver –cum-Owner of the Crime Vehicle, R/o. H.No. 3-101-A, BC Colony, Raghunandapuram, Near R Pamur, Prakasham Dist, Pin-523110.

NOTICE

Please take notice that the above Petitioner had filed the above O.P. for compensation against you and Respondent No. 2 & 3. Several times notices were issued to you through court and R.P. but you have failed to receive the same. The case is posted on the day of 04-07-2023 for your appearance, on that day you have to appear either personally or through your counsel at 10.30 a.m. otherwise the matter will be decided in your absence.

(BY THE ORDER OF THE COURT)
Sd/- L.R.PRAKASH, K. RANJITH KUMAR, K. DIVYA, SAMREEN BEGUM, Advocates, H.No. 10-308/A/2, Vasanthapuri Colony, Malkajgiri, Hyderabad. Cell: 9866611022

1 నుంచి యోగా శిక్షణ

పెద్ద దోర్నాల : పెద్ద దోర్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మే 1 నుంచి జూన్ 3 వరకూ ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని నిర్వహి స్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి శ్రీనివాసులు, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యా యుడుషేక్ అబ్దుల్ సలాం, బుద్ధ యోగా హెల్త్ ఫౌండేషన్ ఆర్గనైజేషన్ సభ్యుడు షేక్ సయ్యద్ వలి తెలిపారు. పాఠశాలలో శు క్రవారం నిర్వహించిన సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకూ రెండు పూటలా యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్ర మంలో ఆర్గనైజేషన్ సభ్యులు మహేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టెండర్ ప్రకటన

ప్రకాశం జిల్లా ,ఒంగోలు మండలం , వలేటివారిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానం నందు క్రింద తెలిపిన పనికి 5వ తరగతి రిజిస్టర్ సివిల్ కాంట్రాక్టర్ల నుండి సీలు వేసిన టెండర్లు కోరబడుచున్నవి .సదరు పనికి తేది : 28-04-2023 ఉదయం 10 గంటల నుండి తేది:09 -05 -2023 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరించబడును. టెండర్ షెడ్యూల్ తేది: 10-05-2023 ఉదయం 10 గంటల నుండి అదే రోజు సాయంత్రం 5గంటల వరకు ఇవ్వబడును. టెండర్ దరఖాస్తు తో పాటు టెండర్ ధరావత్తు డిమాండ్ డ్రాఫ్ట్ గాని, నగదు చెల్లించిన రసీదు గాని జత పరచవలెను. షీల్డ్ కవర్లు తేది: 12 -05 -2023 ఉదయం 11 గంటల వరకు పై దేవస్థానం వద్ద స్వీకరించబడి అదే రోజు సాయంత్రం 4 గంటలకు శ్రీయుత జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారి, ఒంగోలు వారి కార్యాలయము నందు వారిచే గాని వారి అనుమతి పొందిన వారు చేయగానే టెండర్లు తెరువబడును.

వ.నెం	పని పేరు	అంచనా విలువ	టెండర్ ధరావత్తు	టెండర్ షెడ్యూల్ ఖరీదు	పనిపూర్తి చేయు కాలం
1	ముఖ మండపం ముందువైపు స్టీల్ గేట్లు ఏర్పాటు చేయుట	రూ. 1,70,000/-	రూ. 4250/-	రూ. 500/-	2 నెలలు

గమనిక :- ఏ కారణము తెలుపకనే టెండర్లు పురస్కరించు తిరస్కరించు అధికారం కార్యనిర్వహణాధికారి వారికి కలదు.

ఇట్లు
కోవి శేషగిరిరావు
మేనేజింగ్ ట్రస్టీ

గ్రామ పంచాయతీ కార్యాలయం,భట్టిప్రోలు

ఆర్.సి.నం.01/2023 **టెండరు ప్రకటన** ది.27-04-2023

బాపట్ల జిల్లా,భట్టిప్రోలు మండలం,భట్టిప్రోలు గ్రామ పంచాయతీ ఈ దిగువ షెడ్యూల్ దాఖలా 2023-24 సంవత్సరానికి సంభంధించి టెండరు పద్ధతిపై పని చేయుటకు,అవసరమైన సామానులు సరఫరా చేయుటకు సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి. ఆసక్తి కలవారు తగిన ధరావతు చెల్లించి టెండర్ దాఖలు చేయవలెను.ది.05-05-2023 మధ్యాహ్నం 12.00 గంలకు స్వీకరించబడి అదే రోజు 3.00గం. లకు హాజరైన టెండరు దార్ల సమక్షంలో తెరవబడును.ఏ కారణం చేతనైన టెండర్లు నిలిపివేయుట లేదా వాయిదా వేయుటకు కార్యదర్శి వారికి అధికారము కలదు.

షెడ్యూల్

వ.నెం.	పనివివరము	ధరావతు
1.	2023-24 సం.నకు పబ్లిక్ హెల్త్ సామాన్లు సరఫరా చేయుట	500
2.	2023-24 సం.నకు పి డబ్ల్యూ ఎస్ సామాన్లు సరఫరా చేయుట.	500
3.	2023-24 సం.నకు పంపు సామాన్లు సరఫరా చేయుట	500
4.	2023-24 సం.నకు స్టేషనరీ సామాన్లు సరఫరా చేయుట	500
5.	2024-24 సం.నకు 1 ఏడాది పాటు టెండర్ స్వీపర్లుగా పనిచేయుటపోస్టులు 24	100
6.	2023-24 సం.నకు 1 ఏడాది పాటు టెండరు పిట్టర్ గా పని చేయుట పోస్టులు4	100
7.	2023-24 సం.నకు 1 ఏడాది పాటు టెండరు పై ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేయుటపోస్ట్-1	100
8.	2023-24 సం. నకు ఏడాది పాటు టెండరు పై కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేయుట పోస్ట్-1	100
9.	2023-24 సవత్సరానికి విద్యుత్ సామాన్లు సరఫరా చేయుట.	500

సం//
కోట శ్రీనివాసరావు
పంచాయతీ కార్యదర్శి, భట్టిప్రోలు

చోరీకేసులో నిందితులు అరెస్టు


రూ.34.50 లక్షల సొత్తు స్వాధీనం ● జిల్లా ఎస్పి మల్లికగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

అతి తక్కువ వ్యవధిలో చోరీ కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పి మల్లికగర్గ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.34.50 లక్షల విలువైన 92.75 సవర్ల బంగారు ఆభరణాలు, 5 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్పి కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఎస్పి తెలిపిన వివరాల మేరకు.. మార్చి 7వ తేదీన తాళ్లూరు గ్రామంలోని శ్రీనివాస కిరాణా షాపు యజమాని తన కుటుంబ సభ్యులతో కలసి సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి తిరుణాళ్ల సందర్భంగా రాత్రి 8 గంటలకు వెళ్లారు. మరలా తిరిగి ఇంటికి తెల్లవారు జామున 3 గంటలకు వచ్చే సరికి ఇంటి తాళం పగులకొట్టి ఇంటిలోకి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలు దొంగిలించినట్లు తెలిపారు. దీనితో తాళ్లూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి నిందితులను శుక్రవారం శివరాంపురం వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు.

నిందితులు వీరే..

పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డి గూడేనికి చెందిన వనపర్తి రాజు (ప్రస్తుత నివాసం అద్దంకి మండలం ధేనువ కొండ (గ్రామం), చలంచర్ల మల్లికార్జున, తేటిపేట గ్రామం పొన్నలూరు మండలం, చలంచర్ల ఆంజనేయులు, చలంచర్ల చెంచయ్య, అద్దంకి మండలం ధేనువకొండకు చెందిన కొమర గిరి పేరయ్య. వనపర్తి రాజు అలియాస్ శివ ఈ ముఠాకు నాయకుడిగా చలామణి అవుతున్నాడు. చిన్నతనంలోనే తల్లి దండ్రులు చనిపోవడంతో మద్యం, పేకాట వంటి వ్యసనాలకు బానిసయ్యాడు. డబ్బు అవసరమైనపుడు రాత్రి సమయంలో దొంగతనాలు చేస్తూ ఆ సొమ్ముతో జల్సాలు చేసేవాడు. అతనిపై వివిధ జిల్లాల్లో కేసులు నమోదయి ఉన్నట్లు తెలిపారు. సాలూరు పోలీసులు అరెస్టు చేసి జైలు నుంచి వచ్చిన తరువాత చెన్నై వెళ్లి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అక్కడ చల్లపల్లి మల్లికార్జున అక్క నాగమణి పరిచయమైంది. దీనితో ధేనువకొండకు చెందిన నందినిని వివాహం చేసుకుని ధేనువకొండలో కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. కరోనా సమయంలో పనులు లేకపోవడంతో చిన్నచిన్న దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. దొంగతనం చేసిన డబ్బులతో కారు కొనుగోలు చేసి ఆ వాహనంలో వెళ్లి దొంగతనాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేసును దర్శి డిఎస్పి వి నారాయణస్వామి రెడ్డి పర్యవేక్షణలో, దర్శి సిఐ జె రామకోటయ్య, తాళ్లూరు ఎస్ఐ బి ప్రేమకుమార్, ముండ్లమూరు ఎస్ఐ ఎల్ సంపత్, ఎఎస్ఐ జి మోహన్‌రావు, సిబ్బంది ప్రతిభ కనపరచి ముద్దాయిలను అరెస్టు చేసినట్లు తెలిపారు.



బాపట్ల తహశీల్దార్ సుధారాణికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

మత్స్యకారుల పొట్టకొట్టొద్దని తహశీల్దారుకు వినతి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

తరతరాల నుంచి సముద్రంలో చేపలు పట్టుకొని జీవిస్తున్నవారి బతుకుదెరువును దూరం చేయొద్దని బాపట్ల మండలం అడివి పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురం గ్రామస్తులు శుక్రవారం బాపట్ల తహసీల్దార్ సుధారాణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సముద్రం ఒడ్డున బోట్లు పెట్టుకునే, చేపలు ఎండబెట్టే తమ భూభాగం ఖాళీ చేయమని గ్రామానికీ ఎటువంటి సంబంధం లేని అపరిచిత వ్యక్తులు ఒత్తిడి తెస్తున్నారని అన్నారు. తాము వలలు పెట్టుకొనే స్థలం తమది అని, వాటి తాలూకు పట్టాలు తమ వద్ద ఉన్నాయని, స్థలాన్ని ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారని చెప్పారు. వీరి బారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరారు. సముద్ర జలాల నుంచి 500 మీటర్ల దూరం పరిధిలో మడ అడవులు పెంచాలని, సీఎంజెడ్ నిబంధనలు అమలు చేయాలని కోరారు. సముద్ర అలలు గ్రామాల మీదకు రాకుండా ఉన్న సహజ సిద్ధ ఇసుక దిబ్బలను ధ్వంసం చేస్తున్న వారిపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ భూ భాగంలో మడ అడవులు మాత్రమే పెంచాలని అన్నారు. దీని వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని అన్నారు. అలాంటి భూభాగంలో పట్టాలు ఉన్నాయని కొందరు అంటున్నారు. వారికి నిబంధనలకు విరుద్ధంగా పట్టాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. తీరంలో అక్రమంగా ఉన్న నిర్మాణాలు తొలగించి మత్స్యకారులు చేపల బోట్లు, చేపలు ఆరబెట్టే స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సూర్యలంక తీర ప్రాంతం అడివి పంచాయతీ పరిధిలోని 13 గ్రామాల్లో అక్రమంగా నిర్మాణాలు చేస్తూ రిసార్ట్స్, హేచరీలు నిర్మిస్తూ పర్యావరణానికి ముప్పు కలిగించే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు లాజర్, రంజాన్, ప్రగతి శీల మహిళా సంఘం బాపట్ల మండల కార్యదర్శి పల్లవి, నాయకులు శ్రీనివాసరావు, గ్రామస్తులు యోహాను, రాజీ బాబు, గోవిందు, రాముడు, శ్రీను పాల్గొన్నారు.

రైలు ఎక్కబోతూ జారిపడి

మహిళకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-చీరాల

కదులుతున్న రైలు ఎక్కేందుకు ప్రయత్నించిన ఓ మహిళ కాలు జారీ ప్లాట్ ఫాం రైలు బోగిల మధ్యలో చిక్కుకుంది. మండలం కరేడు గ్రామానికి చెందిన కట్టా తిరుపతమ్మ మరుగుదొడ్డి కోసం రైలు నుంచి కిందకు దిగింది. అనంతరం వెంటనే రైలు కదలటంతో ఆమె హడావుడిగా రైలు ఎక్కబోయి జారిపడింది. ప్రయాణికులు అప్రమత్తమై ఒక నిండు ప్రాణాన్ని కాపాడటంతో పలువురు వారిని అభినందించారు. ఈ ఘటన బాపట్ల జిల్లా చీరాల రైల్వేస్టేషన్లో శుక్రవారం ఉదయం చోటుచేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. విజయవాడ నుంచి గూడూరు వరకు ప్రయాణించే 17260 మెమో ఎక్స్‌ప్రెస్ చీరాలకు ఉదయం సుమారు 8 గంటల సమయంలో స్టేషన్‌కు వచ్చింది. ఈ సమయంలో రైలులో ప్రయాణిస్తున్న ప్రకాశం జిల్లా ఉలవపాడు మండలం కరేడు గ్రామానికి చెందిన కట్టా తిరుపతమ్మ మరుగుదొడ్డి కోసం రైలు దిగింది. అయితే వెంటనే రైలు కదలడంతో ఆమె జారి ప్లాట్‌ఫారానికి, రైలుకు మధ్యలో ఇరుక్కుపోయింది. ఈ ఘటన చూసిన సమీపాన ఉన్న ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ డి కోటేశ్వరరావు, జీఆర్పి కానిస్టేబుల్ నాగార్జున ఇద్దరూ కలిసి విజిల్స్ వేస్తూ రైలును ఆపివేశారు. అనంతరం తోటి ప్రయాణికులు, స్థానికుల సాయంతో ప్లాట్ ఫారంను పగులగొట్టి తిరుపతమ్మను అతికష్టంపై బయటకు తీసుకొచ్చారు. పొట్ట నడుము వద్ద తీవ్రగాయాలైన తిరుపతమ్మను 108 సాయంతో చీరాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవల కోసం ఒంగోలుకు తరలించారు. తిరుపతమ్మను బయటకు తీసే ప్రయత్నంలో సుమారు 50 నిముషాల పాటు రైలు చీరాల్లో నిలిచిపోయింది.



ప్లాట్ ఫామ్, రైలు మధ్య ఇరుక్కుపోయిన మహిళ

ల్యాప్ టాప్, సెల్ ఫోన్ల చోరీ ముఠా అరెస్టు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరుతో పాటు చుట్టుపక్కల పలు ప్రాంతాలలో తరచూ ల్యాప్‌టాప్‌లు, సెల్ ఫోన్లను దొంగతనం చేస్తున్న ఇరువురు నేరస్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.5.5 లక్షలు విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు ఒంగోలు డివైఎస్పి ఉప్పుటూరి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చోరీ వివరాలను డీఎస్పీ వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం వేలూరు జిల్లా గుడియాతం మండలం శంకరాపురం గ్రామానికి చెందిన అన్నామలై రంగనాథన్, మణియప్పన్ రంగనాథన్ అనే ఇరువురు నేరస్తులు మన ప్రాంతంలో తరచూ ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ మలికగర్గ్ ఆదేశాల మేరకు సింగరాయకొండ సిఐ, టంగుటూరు ఎస్ఐల ఆధ్వర్యంలో ప్రత్యేక నిఘాతో నేరస్తులను అరెస్టు చేసినట్లు తెలిపారు. సదరు నేరస్తుల నుంచి రూ.5.5 లక్షల విలువైన 3 ల్యాప్‌టాప్‌లు, వివిధ కంపెనీలకు చెందిన 42 స్మార్ట్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. అయితే గత పది రోజులుగా ఇరువురు ముద్దాయిలు టంగుటూరులోనే ఉంటూ చెముడు, మూగవారిగా నటిస్తూ యాచించే క్రమంలో సదరు దుకాణదారులు, ప్రజలను పక్కదోవ పట్టించి సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల చోరీకి పాల్పడుతున్నట్లు తెలిపారు. ఖర్చుల కోసం శుక్రవారం ఒక దుకాణంలో ల్యాప్ టాప్‌ను విక్రయించే క్రమంలో పక్కా సమాచారంతో పోలీసులు శుక్రవారం వీరిని అరెస్టు చేశారు. సదరు కేసును చాకచక్యంగా ఛేదించిన సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్, టంగుటూరు ఎస్ఐ షేక్ ఖాదర్‌బాషా, సిబ్బందిని డిఎస్పీ నాగరాజు ప్రత్యేకంగా అభినందించారు.

రూ.5.5 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



టంగుటూరులో కేసు వివరాలను వెల్లడిస్తున్న డిఎస్పి నాగరాజు

పోలీసుల అదుపులో దొంగల ముఠా?

ప్రజాశక్తి-మార్టూరు రూరల్



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనం

ప్రయాణికులను దారి కాచి కత్తులతో బెదిరించి చోరీలకు పాల్పడుతున్న ఓ ముఠాను శుక్రవారం మార్టూరు పోలీసులు అత్యంత చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల స్థానిక జాతీయ రహదారిపై రాత్రి పూట సర్వీసు రోడ్డులో ద్విచక్ర వాహనాలపై వెళుతున్న ప్రయాణికులను కొందరు వ్యక్తులు ఆపి కత్తులు చూపి బెదిరిస్తూ దోపిడీలకు పాల్పడుతున్నారు. ఈ విషయమై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులు సైతం అందడంతో పోలీసులు నిఘా పెట్టి దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం మార్టూరు సమీపంలోని జొన్నతాళి, రాజుగారిపాలెం గ్రామ సమీపంలోని బైక్‌లపై వెళుతున్న కొంతమందిని అడ్డగించి వారివద్ద నుంచి సెల్ ఫోన్లు, నగదును దోచుకుంటున్న ఇద్దరు యువకులను పోలీసు అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

2న అలవలపాడులో మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-పంగులూరు

మండలంలోని అలవలపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం దగ్గర మే నెల 2వ తేదీ మంగళవారం కిమ్స్ హాస్పిటల్స్ ఒంగోలు వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా కంటి వైద్య శిబిరం జరుగుతుందని మెగా కంటి వైద్య శిబిరం సమన్వయకర్త తాళ్లూరి రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుందని అన్నారు. ఈ మెగా కంటి వైద్య శిబిరంలో కంటి సంబంధిత వ్యాధులన్నింటికీ పరీక్షలు నిర్వహించి, కంటి లోపల శుక్లాలు, పొరలు వున్నవారికి వారి ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేస్తారని తెలిపారు. ఈ మెగా కంటి వైద్య శిబిరాన్ని అలవలపాడు, పరిసర గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 9492120399 సెల్ నెంబర్‌కు ఫోన్ చేయాలని అన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

ప్రజాశక్తి-కొల్లూరు

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా సహాయ కార్యదర్శి బొనిగల సుబ్బారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన కొల్లూరులో ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఉపాధి హామీ పనులకు కేంద్రం గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం బడ్జెట్లో 90 వేల కోట్ల రూపాయలు తగ్గించిందని అన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న కనీసం టెంట్‌కు కూడా అవకాశం లేకపోవడం, రెండు పూటలా పని ప్రదేశానికి రావాలని షరతులు విధించడం సరికాదని అన్నారు. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ కూడా అందుబాటులో లేకపోవడం బాధాకరమని అన్నారు. కూలీలకు ప్రతి 15 రోజులకు ఒకసారి పేస్లిప్‌తో కూడిన పేమెంట్ ఇవ్వాలని, వేసవి అలయన్స్ కలపాలని, రెండు పూటలా పని రద్దు చేయాలని, ప్రతి కుటుంబానికి రెండు వందల రోజులు పని కల్పించాలని ఆయన కోరారు.

నిధులు మంజూరు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలోని పలు అభివృద్ధి పనులకు జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.29 లక్షలు మంజూరయ్యాయి. త్రిపురాంతకం మండలంలోని గణపవరంలో రెండు సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.10 లక్షలు, పుల్లలచెరువు మండలం రాచకొండ పరిధిలో రెండు సీసీ రోడ్లకు రూ.10 లక్షలు చొప్పున మంజూర య్యాయి. నీటి సరఫరా విభాగంలో చాపలమడుగు, మర్రివేముల, నాయుడుపాలెం గ్రామాల్లో మూడు బోర్ల కోసం ఒక్కో బోరుకు రూ. 3 లక్షల చొప్పున రూ. 9 లక్షలు మంజూరయ్యాయి. ఈ నిధులతో వెంటనే అభివృద్ధి పనులు ప్రారంభించనున్నారు.

9 నుంచి 'జగనన్నకు చెబుదాం'

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రాష్ట్రంలో ప్రజా సమస్యలు పరిష్కరించడానికి మే9న జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ప్రారంభించడానికి చర్యలు తీసుకున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన జగనన్నకు చెబుదాం కార్యక్రమం, జగనన్న గృహ నిర్మాణాలు, భూ హక్కు, భూ రక్షణ, నాడు నేడు వసతి దీవెన కార్యక్రమాల అమలుపై జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో స్పందన అర్జీల కంటే నాణ్యతతో జగనన్నకు చెబుదాం అర్జీలను పరిష్కరించాలన్నారు. ఇందుకు 1902 టోల్‌ఫ్రీ నెంబర్‌ను ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో 21.25 లక్షల గృహాలను, 2.62 లక్షల టిడ్కో గృహాలను మంజూరు చేసినట్లు తెలిపారు. ఇంతవరకు ప్రారంభించని 97 వేల గృహ నిర్మాణాలు వెంటనే ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో బాపట్ల జిల్లా నుంచి కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్‌పి వకుల్ జిందాల్, జాయింట్ కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి లక్ష్మీ శివ జ్యోతి, సిపిఓ భరత్ కుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి రామారావు, పంచాయతీ రాజ్ ఎస్ఇ శ్రీనివాస్, డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ అర్జున్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.


సిఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్‌పి, జెసి, అధికారులు

మోడీని గద్దె దించేవరకు పోరాటం

ప్రజాశక్తి-దరిశి

కేంద్రంలో బిజెపిని నరేంద్రమోడీని గద్దె దించేంతవరకు ప్రజలందరూ పోరాటాలు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి పిలుపునిచ్చారు. 'మోడీని ఓడిద్దాం... దేశాన్ని కాపాడదాం..' అనే నినాదంతో దరిశిలోని గడియారస్తంభం సెంటర్ వద్ద తూర్పు చౌటపాలెం రోడ్‌లో ప్రచారభేరి బహిరంగసభ సిపిఐ దరిశి నియోజకవర్గ కార్యదర్శి మాదపాకుల రమేష్‌బాబు, సిపిఎం దరిశి నియోజకవర్గ కార్యదర్శి తాండవ రంగారావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఈ నెల 14 నుంచి 30 వరకు జరిగే ప్రచారభేరి యాత్రలో భాగంగా 9 సంవత్సరాలలో నరేంద్రమోడీ అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరించామన్నారు. అంబానీ, అదానీ, టాటా, బిర్లా వంటి సంస్థలకు దేశంలోని ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు పరం చేస్తూ మోడీ పరిపాలన చేస్తుందని విమర్శించారు. రైల్వే, ఎల్ఐసి, బ్యాంకింగ్, విశాఖపోర్ట్ వంటి వాటిని తక్కువ ధరలకు మోడీ అమ్మేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రపంచకుబేరులలో తొమ్మిదేళ్లలో అదానీ ఎదిగారని, అదానీ అంటే ప్రధాని మోడేనని ఆయన పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వానికి ఈ రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, చంద్రబాబు, జనసేనపార్టీలు అండగా నిలుస్తున్నాయని వచ్చే ఎన్నికలలో బిజెపిని ఓడించాలన్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ ప్రయివేటు రంగాలను ప్రోత్సహిస్తూ రైతాంగానికి, కూలీలకు, కార్మికులకు అన్యాయం చేస్తున్నారన్నారు. రైతులకు సబ్సిడీ ఇవ్వకుండా రూ.లక్ష కోట్లతో జీవ వ్యవసాయ పద్ధతులు ప్రారంభించారన్నారు. శ్రీలంకలో ఈ వ్యవసాయం ప్రారంభించి ఆర్థికంగా చితికిపోయిందని ఆయన గుర్తు చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత 6 లక్షల పరిశ్రమలు మూతపడ్డాయన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు రాష్ట్రంలో ఉన్న వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలలో కూడా మద్దతు పలికాయని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలందరు వచ్చే ఎన్నికలలో ఓటు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, సిపిఎం జిల్లాకార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లాకార్యదర్శి వర్గసభ్యులు హనుమంతరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెల్లంపల్లి ఆంజనేయులు, సిపిఎం దొనకొండ మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, సిపిఎం దరిశి మండల నాయకులు సందు వెంకటేశ్వరరావు, సిపిఐ దరిశి పట్టణ కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు, సిపిఐ ముండ్లమూరు మండల కార్యదర్శి సుంకర అంజిరెడ్డి, దొనకొండ మండల సిపిఐ కార్యదర్శి సిహెచ్ గురుమూర్తి, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కెవి పిచ్చయ్య, ఐదు మండలాల సిపిఐ, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి

ఉపాధ్యాయ ఉద్యమనేత లూకయ్య మృతి

సీపీఎం, సీఐటీయూ నాయకుల నివాళి ● నేడు ఆయన మృత దేహానికి అంత్యక్రియలు

ప్రజాశక్తి-చీరాల

ఉపాధ్యాయ రంగంలో ఎందరో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసి వారిని తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు, యూటీఫ్ జిల్లా మాజీ కార్యదర్శి పంది లూకయ్య(78) శుక్రవారం మధ్యాహ్నం అనారోగ్యంతో మృతి చెందారు.

లూకయ్య 1974లో చీరాల మునిసిపాలిటీలో ఉపాధ్యాయుడిగా జీవితం ప్రారంభం నుంచి రిటైర్మెంట్ నాటి వరకు యూటీఫ్ ఫౌండర్‌గా, సభ్యుడిగా నాయకుడిగా వివిధ క్యాడర్లలో పనిచేశారు. యూటీఫ్‌లో కొనసాగుతూనే జన విజ్ఞాన వేదికలో 1988 నుంచి చీరాల ప్రాంతంలో వ్యవస్థాపకుడిగా ఉన్నాడు. 1998 కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం వ్యవస్థాపకుడుగా, 2002 నుంచి గుర్రం జాషువా సాహితీ సమితి వ్యవస్థాపకుడిగా, మధ్యతరగతి ఉద్యోగులతో, ప్రోగ్రెసివ్ స్టడీ సర్కిల్ నిర్వహణలో, కార్మిక పోరాటాలకు సహకారిగా సీపీఎం పార్టీలో సభ్యుడిగా సుదీర్ఘ కాలంపాటు తన యావత్ జీవితం ప్రజా ఉద్యమాలకు అంకితం చేశారు. లూకయ్య పార్థివ దేహానికి సీపీఎం చీరాల కమిటీ కార్యదర్శి ఎన్ బాబురావు, ఎం వసంతరావు సీనియర్ నాయకులు పి కొండయ్య, కెవిపిఎస్ నాయకులు ఎల్ జయరాజు, జెవివి నాయకులు కె రామారావు, డి నారపరెడ్డి, సీఐటీయూ నాయకులు డి నాగేశ్వరరావు, యూటీఫ్ నాయకులు బండి భిక్షాలు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు డి రమాదేవి, రాష్ట్ర నాయకులు జాలా అంజయ్య, పునాటి ఆంజనేయులు, కె ఉమామహేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి గంగయ్య, సీఐటీయూ నాయకులు చీకటి, శ్రీనివాసరావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్ తదితరులు సంతాపం ప్రకటించారు.


లూకయ్య మృతదేహానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు (ఇన్‌సెట్‌లో) లూకయ్య (ఫైల్)


ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటేసేందుకు వీల్ చైర్‌పై వస్తున్న లూకయ్య (ఫైల్)

- వీల్ చైర్‌లో వచ్చి.. ఎమ్మెల్సీ ఓటు వేసి..

ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలలో లూకయ్య తీవ్ర అనారోగ్యంలోనూ తన ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకునేందుకు సిపిఎం నాయకుల సహాయంతో పోలింగ్ కేంద్రానికి వీల్ చైర్‌లో వచ్చారు. ఆయన చివరిసారిగా తన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. లూకయ్య మృతితో అటు కుటుంబ సభ్యులలోనూ, ఇటు ఉపాధ్యాయులలోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

మేడేను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-సంతమాగులూరు

సంతమాగులూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు బత్తుల హనుమంతరావు తెలిపారు. శుక్రవారం సంతమాగులూరులోని కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కే శ్రీదేవి, గౌరవ అధ్యక్షులుగా బత్తుల హనుమంతరావు, కార్యదర్శిగా జి నాగమణి, కమిటీ సభ్యులుగా ఎన్ ఎస్తేరురాణి, ఏ నిర్మల, జి నాగలక్ష్మి, జి సత్యవతి, పి నాగలక్ష్మి, మరో పదిమందిని నూతన కమిటీలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా కొనసాగుతున్న అంగన్ వాడి సంతమాగులూరు ప్రాజెక్టుని రెండుగా విడదీశారన్నారు. మార్టూరు, యద్దనపూడి మండలాలను పర్చూరు ప్రాజెక్టులో కలిపి, పల్లికురవ, సంతమాగులూరు మండలాలను సంతమాగులూరు ప్రాజెక్ట్‌లో కలిపారు అన్నారు. అందువలన సంతమాగులూరు ప్రాజెక్టు నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందన్నారు. భవిష్యత్తులో ఏ కార్యక్రమం జరిగినను అధికారులు గతంలో లాగానే సహకారం అందివ్వాలన్నారు. పాత టిఏ బిల్స్, ఇంటి అద్దెలు త్వరగా పూర్తి చేసి ఇవ్వాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'డిఎన్ఎం' జూనియర్ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు డిఎన్ఎం జూనియర్ కళాశాల విద్యార్థులు మార్చిలో జరిగిన ఇంటర్ పబ్లిక్ పరీక్షలలో కార్పొరేట్ విద్యా సంస్థల విద్యార్థులతో పోటీపడి ఉత్తమ ఫలితాలు సాధించారు. ఎంపిసి మొదటి సంవత్సరం విద్యార్థులు ఎం చిరంజీవి 449, భవనం లాస్య 442, నాయుడు సాకేత్ 432, పఠాన్ రూబియా 406 మార్కులు సాధించారు. బైపిసి విద్యార్థులు చిడిపూడి శివ పార్వతి 409, సిఈసి విద్యార్థులు షేక్ సుభాని వలి 405, రెండో సంవత్సరం విద్యార్థులు ఎంపిసి విభాగంలో గుడి రామాంజనదేవి 969, షేక్ వానిబీ 969, సింగరాజు జాహ్నవి 962 మార్కులు సాధించారు. 900 పైగా 9 మంది, బైపిసి విభాగం లో మార్పు రమ్య 950 గొల్లపూడి దినేష్ 938, పంది సజన్ కుమార్ 933 మార్కులు సాధించి ప్రతిభ కనబర్చారు. విద్యార్థిని విద్యార్థులను కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

శ్రీ గౌతమి విద్యార్థులు విజయభేరి

జూనియర్ ఇంటర్‌లో ఇంకొల్లు శ్రీ గౌతమి విద్యార్థులు విజయభేరి మోగించారు. 470 మార్కులకు మీరా కుమారి 458 మార్కులు సాధించింది. షేక్ ఇస్రాంత్ 456 మార్కులు సాధించారు. 400కి పైగా 14 మంది మార్కులు సాధించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ ఎం వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కె శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ మోబిన్‌లు అభినందించారు.


ప్రచారయాత్రలో పాల్గొన్న నాయకులు

వేమూరులో ప్రచార భేరి

ప్రజాశక్తి-వేమూరు

మోడీ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రచారభేరి శుక్రవారం మండల కేంద్రం వేమూరులో జరిగింది. బిజెపి పాలనలో పేద, మధ్య తరగతి, సామాన్య ప్రజానీకం వివిధ సమస్యలతో అల్లాడుతున్నారని, మోడీని, బిజెపిని ఇంటికి సాగనంపితేనే దేశం సుభిక్షంగా ఉంటుందని సిపిఎం బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు టి కృష్ణమోహన్ పిలుపునిచ్చారు. పార్లమెంటు సాక్షిగా ఏపి విభజన చట్టంలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ దేశ సంపదను దోచి పెడుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి అగస్టీన్, జి సుధాకర్, నాగరాజు, ఎం సత్యనారాయణ, మస్తాన్‌రావు, దాసు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాల విషయంలో ..

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు : జేసీ

ప్రజాశక్తి-టంగుటూరు

జగనన్న కాలనీ లేఅవుట్లలో ఇప్పటికీ కొందరు నేటికీ గృహాలు నిర్మించుకోక పోవడం పట్ల జిల్లా సంయుక్త కలెక్టర్ కె.శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక వెంకటాయపాలెంలోని జగనన్న కాలనీ లే అవుట్‌ను జేసీ శుక్రవారం పరిశీంచారు. ఈ సందర్భంగా జేసీ లేఅవుట్‌పై నివేదిక కోరగా తహాశీల్దారు కె. సంజీవరావు మాట్లాడుతూ వెంకటాయపాలెం లేఅవుట్‌లో మొత్తం 390 ప్లాట్లను కేటాయించినట్లు తెలిపారు. 157 మంది లబ్ధిదారులకు ప్లాట్లు మంజూరు చేసినట్లు చెప్పారు. గహ నిర్మాణ శాఖ ద్వారా 157 మందికి గహాలు మంజూరు కాగా వాటిలో


లేఅవుట్ ను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు

110 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాలేదన్నారు. ఈ సందర్భంగా జేసీ లబ్ధిదారులతో మాట్లాడగా తాము ఆర్థిక ఇబ్బందులతో గృహాలు నిర్మించుకోలేదని జేసీ దృష్టికి తీసుకొచ్చారు. రెవెన్యూ, గహ నిర్మాణం, వెలుగు శాఖల సంయుక్త కషితో వీలైనంత త్వరగా గహ నిర్మాణాలను వేగవంతం చేయాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఇ పేరయ్య, నియోజకవర్గ ప్రత్యేక అధికారి జి.నాగిరెడ్డి, హౌసింగ్ డిఇఇ పాటిబండ్ల జయరావు, ఎఇ పఠాన్ రియాజ్, తహశీల్దారు కె. సంజీవరావు, ఎపిఒ సుభాషిణి, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలని నిరసన

ప్రజాశక్తి-పొన్నలూరు

ఢిల్లీలో మహిళా రేజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షురాలు వై.సత్యవతి డిమాండ్ చేశారు. మహిళా రేజ్లర్లపై లైంగికవేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ అరెస్టు చేయాలని కోరుతూ అంగన్‌వాడీలు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ క్రీడల్లో స్వర్ణ పతాకాలు సాధించి భారతదేశ ప్రతిష్టను ప్రపంచ స్థాయిలో ఇనుమడింప చేసిన మహిళ రేజ్లర్లను కన్న తండ్రిలా చూసుకోవాల్సిన భారత రేజ్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు మరియు బిజెపి ఎంపీ బిజ్ భూషణ్ శరణ్‌సింగ్ లైగింక వేధింపులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. బాలికపై అఘాయిత్యాలకు పాల్పడిన బిజెపి ఎంపీని తక్షణమే పదవి నుంచి తక్షణం తొలగించి పోక్సో చట్టం క్రింద అరెస్టు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎం.పోలమ్మ, ఎం.మధురవాణి, లక్ష్మీశ్వరి, టి.తిరపతమ్మ, ఎస్.ప్రశాంతి పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

చెత్తను వేరు చేసి అందించాలి : కమిషనర్

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

తడిచెత్త, పొడిచెత్త, హానికార చెత్తను విభజించి మూడు బుట్టల విధానం ద్వారా క్లాప్ ఆటోలకు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. వెంకటేశ్వరరావు కోరారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా సుజాత నగర్‌లో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా నాలుగోలైన్ ఎక్స్‌టెన్షన్‌లో కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. భవన నిర్మాణ వ్యర్థాలు కాలువలో వేయడం వల్ల కాలువలో మురుగునీటి ప్రవాహం నిలిచి పోయిందని, వెంటనే వ్యర్థాలు తొలగించి మురుగు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని శానిటరీ సిబ్బందికి సూచించారు. సుజాతనగర్‌లో ప్రజలు క్లాప్ ఆటోలకు అందిస్తున్న చెత్తను పరిశీలించారు. ఇళ్లలోనే చెత్తను మూడు బుట్టల విధానంలో వేరు చేసి అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. . ప్రభుత్వం నిషేధించిన ప్లాస్టిక్ వినియోగాన్ని ప్రజలు ఆపేయాలని కోరారు. కమిషనర్ వెంట 37వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్ వైజర్ ఎన్.పిచ్చయ్య, ఇన్‌స్పెక్టర్ షేక్ బాబ్జీ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.


ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్


వృద్ధులకు చేతి కర్రలు అందజేస్తున్న అశోక్‌బాబు

పేదల సంక్షేమమే ధ్యేయం : వరికూటి

శింగరాయకొండ : పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని వైసిపి కొండపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. మండల పరిధిలోని బింగిలినపల్లి గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు ఎస్‌సి కాలనీ. పెద్దన్నపాలెం, అంబేద్కర్ నగర్‌లో గడపగడపకూ తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామ సర్పంచి జెట్టి విజయలక్ష్మి నివాసానికి వెళ్లి ఆమెతో మాట్లాడారు. అనంతరం వృద్ధులకు చేతి కర్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సామంతుల రవికుమార్ రెడ్డి, ఎంపిడిఒ షేక్ జమీవుల్లా, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటేశ్వర్లుకు సన్మానం

పామూరు : పామూరు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న పాటిబండ్ల వెంకటేశ్వర్లు శింగరాయ కొండకు బదిలీ అయ్యారు. అందులో భాగంగా శుక్రవారం వీడ్కోలు సభ నిర్వహించారు.ఈ సందర్భంగా కనిగిరి మాజీ ఎఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, పామూరు సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు బైరెడ్డి జయరామిరెడ్డి ఆధ్వర్యంలో వెంకటేశ్వర్లును సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి కావిటి వెంకట సుబ్బయ్య, రాయుడు పాల్గొన్నారు.

వెలుగు కార్యాలయం ముట్టడి

- నిధుల దుర్వినియోగంపై గిరిజనుల ఆగ్రహం
- విచారణ చేపట్టిన అధికారులు

ప్రజాశక్తి -శింగరాయకొండ

గ్రామాల్లోని పేద మహిళలలు ఆర్థిక స్వావలంబన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన నిధులు అధికారుల అలసత్వంతో పక్కదారి పట్టి దుర్వినియోగం అయ్యాయి. దీంతో శింగరాయకొండ మండలం పెద్ద కనుమళ్ళ గిరిజనులు వెలుగు కార్యాలయాన్ని ముట్టడించారు. అధికారులు శుక్రవారం కనుమళ్ల గ్రామానికి వెళ్లి మహిళలతో సమావేశమయ్యారు ఈ సందర్భంగా మహిళలు తమకు డబ్బులు డ్రా చేస్తున్నారని, ఇష్టం వచ్చినట్టు తీర్మానాలు చేస్తున్నారని వివరించారు. అదేమని అడిగితే కొందరు వైసిపి నాయకులు కేసులు తమపై కేసులు పెడతామని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఇటీవల తమకు గ్రూపులకు సంబంధం లేకుండా కొత్త వారిని చేర్చి సభ్యులను బాకీదారులుగా చూపడం దారుణమని ఎంపిడిఒ జమిఉల్లా వద్ద మొర పెట్టుకున్నారు. ఇలాంటి పరిస్థితిలో పేద మహిళలను ఏవిధంగా సాధికారిత సాధిస్తారని వారు వాపోయారు. పొదుపు సంఘాలకు సంబంధం లేని వారు బాతుల మిషనరీలకు ఏవిధంగా బ్యాంకు నుంచి రుణం తెచ్చుకుంటారని వారు ప్రశ్నించారు. తొలుత ఉదయం 11 గంటల సమయంలో వెలుగు కార్యాలయానికి వెళ్లారు. అప్పటికీ కార్యాలయానికి తాళం తీయలేదు. అక్కడ నుంచి ఎంపిడిఒ కార్యాలయానికి చేరుకున్నారు. కనుమళ్ల డ్వాక్రా సంఘాల్లో జరుగుతున్న అవినీతి గురించి ఎంపిడిఒకు వివరించారు. గ్రామంలోని కొందరు వైసిపి నాయకులు తమను బెదిరిస్తున్నట్లు తెలిపారు. దీంతో స్పందించిన ఎంపిడిఒ మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి


కార్యాలయం ఆందోళన చేస్తున్న గిరిజనులు

విచారణ చేపిస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. తట్టా, బుట్టా అల్లుకొని బతికే తమను మోసం చేయటం దారుణమని మహిళలు వాపోయారు. సుమారు రూ.22 లక్షల మేర అవినీతి జరిగినట్లు వారు తెలిపారు. నాలుగు గ్రూపు సంఘాల మహిళలు చెప్పిన వివరాల ప్రకారం రూ. 22 లక్షల అవినీతి ఉందని, మిగతా గ్రూపుల వివరాలపై విచారణ చేపడితే మరిన్ని అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉందని వారు తెలిపారు. ఎసి రాంబాబు, ఎపిఎం జయరాజు సాంబయ్య డిఆర్‌డిఎ డిపిఎం సుబ్బారావు డిపిఎం డేవిడ్ ఉన్నతి ఎటిఎం ప్రసాద్, కెనరా బ్యాంక్ మేనేజర్ ప్రభాకర్ ఫీల్డ్ అసిస్టెంట్, విఎ పత్తిపాటి పద్మ బాధిత మహిళలతో మాట్లాడారు. బ్యాంక్ అధికారులు ఏదో విషయం వివరించే ప్రయత్నం చేయగా మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చివరకు అధికారులు చివరకు అన్ని తీర్మానాలను రద్దు చేస్తున్నామని, కొత్త తీర్మానాలతోనే రుణాలు ఇస్తామని చెప్పాడంతో మహిళలు ఆందోళనను విరమించారు.


విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల చైర్మన్

'అమృత' విద్యార్థుల విజయభేరి

ప్రజాశక్తి -శింగరాయకొండ

ఇంటర్ పరీక్ష ఫలితాల్లో స్థానిక అమత జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో కుంచాల అఖిల 451/470, లోషిన్ 445/470, బి. దత్తాత్రేయ 443/470 మార్కులు సాధించారు. సిఇసి విభాగంలో కుంచాల కీర్తన 439/500 సాధించింది. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో మహమ్మద్ సుల్తానాభి 970/1000, బి.తన్విష్ 966/1000, టీ.నందిని 960/1000, కె. దివ్యేష్ 953/1000 మార్కులు సాధించారు. బైపిసిలో పి.మెహర్ 952/1000, జి.వెన్నెల 924/1000 మార్కులు సాధించారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కెవి.శేషమ్మ, కేశవరపు జాలిరెడ్డి, ప్రిన్సిపల్ టి. శ్రీనివాసరావు అభినందించారు.

పిఎన్‌సిఎ విద్యార్థుల పతిభ

ప్రజాశక్తి -శింగరాయకొండ

ఇంటర్ ఫలితాల్లో స్థానిక పిఎన్‌సిఎ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి అధ్యధిక మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డి. నాగేశ్వరరావు తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంపిసిలో పి.స్పందన 938, కెవి. నాగేంద్ర కుమార్ 851 మార్కులు సాధించినట్లు తెలిపారు. సిఇసిలో పి. శివ సాయి 845, జి. అమూల్య 841 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. డైరీ సైన్స్‌లో ఆర్. హరీష్ 941, కె. మౌనిక 893 మార్కులు సాధించినట్లు తెలిపారు. జూనియర్ డైరీ సైన్స్‌లో జి.పూజిత 442 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ పి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.గీతారాణి అభినందించారు.


బహుమతులు అందుకున్న విద్యార్థులు

విజేతలకు బహుమతులు అందజేత

శింగరాయకొండ : ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజషన్ కన్వీనర్ బి.మధుబాబు ఆధ్వర్యంలో పాకల జడ్‌పి హైస్కూల్‌లో 6 నుంచి 9 తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఈనెల 13న టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. టాలెంట్‌టెస్‌లో గెలుపొందిన విద్యార్థులు నగదు బహుమతి, మెమోంట్‌లు, మెడల్స్‌తో శుక్రవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. శివాజీ, ఉపాధ్యాయుడు ఉస్మాన్ సాహెబ్, గ్రామ సర్పంచి ప్రభాకర్ రెడ్డి , ఎంపిటిసిలు అశోక్ రెడ్డి, ఏపూరి శ్రీను, మాజీ సర్పంచులు పాలేపు మాధవ, సైకం చంద్రశేఖర్, వైసిపి నాయకులు గొల్లపోతు గోవర్ధన్, రాఘవులు స్కూల్ చైర్మన్ మాధవరావు, రాజా రమేష్ , వైసిపి యువ నాయకుడు డి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమాలపై డిప్యూటీ సిఇఒ విచారణ

శింగరాయకొండ : శింగరాయకొండ పంచాయతీలో కార్యాలయంలో డిప్యూటీ సిఇఒ హనుమంతరావు ఆధ్వర్యంలో శుక్రవారం విచారణ జరిపారు. గత సోమవారం స్పందన కార్యక్రమంలో ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామపంచాయతీలో జరిగిన అక్రమాలపై కొందరు ఫిర్యాదు చేశారు. అందులో భాగంగా గతంలో పని చేసిన అధికారుల సమక్షంలో రికార్డులను పరిశీలించారు. పూర్తిస్థాయి నివేదిక ఉన్నతాధికారులకు అందజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జమివుల్లా, ఇఒఆర్‌డి అంజలి దేవి, ఇన్‌ఛార్జి కార్యదర్శి సైదులు తదితరులు పాల్గొన్నారు.

నిలిచిన డయాలసిస్ సేవలు

ప్రజాశక్తి-కనిగిరి;

విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలోని డయాలసిస్ సెంటర్‌లోని పరికాలు, ఏసీలు కాలిపోయాయి. దీంతో డయాలసిస్ సేవలు నిలిచిపోయాయి. అప్రమత్తమైన సిబ్బంది డయాలసిస్ పేషెంట్‌లను ప్రత్యేకంగా అంబులెన్స్‌ల ద్వారా ఒంగోలు, కందుకూరులోని డయాలసిస్ సెంటర్లకు తరలించారు. సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు డయాలసిస్ సేవలను త్వరతిగతిన అందించేందుకు చర్యలు చేపట్టారు.

నేడు మున్సిపల్ సమావేశం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం శనివారం సాయంత్రం 4 గంటలకు మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీక్రిష్ణ అధ్యక్షతన నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ గిరికుమార్ శుక్రవారం తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

వికలాంగులకు అన్నదానం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని మాచర్ల రోడ్డులోనున్న సన్‌జో సేవాలయంలో ఆశ్రయం పొందుతున్న మానసిక వికలాంగులకు యర్రగొండపాలెం పట్టణానికి చెందిన మలిపెద్ది రవీంద్రబాబు శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మలిపెద్ది రవీంద్రబాబు మాట్లాడుతూ తమ తండ్రి మలిపెద్ది వెంకటేశ్వరరావు ద్వితీయ వర్ధంతి సందర్భంగా అన్నదానం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మలిపెద్ది రవీంద్రబాబు, కుటుంబ సభ్యులు, చైతన్య జ్యోతి ఫ్రెండ్ సర్కిల్ సభ్యులు విట్టా కోటేశ్వర్లు, జ్యోతి ప్రసాదరావు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - గిద్దలూరు

వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు గిద్దలూరు పట్టణంలోని పెద్ద పోస్టాఫీస్ వద్ద శ్రీ సత్యసాయి ధ్యాన మందిరం ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి ధ్యాన మందిర సభ్యులు సూరె సుబ్బరామయ్య, విశ్రాంత పోస్ట్ మాస్టర్ రాములు, పరుచూరి సుబ్బారావు, భవనాశి పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

30న విఆర్‌ఒల సంఘం ఎన్నికలు

ప్రజాశక్తి - ఒంగోలు క్రైం

ఒంగోలులోని అంబేద్కర్ భవన్‌లో ఈనెల 30న విఆర్‌ఒల జిల్లా కమిటీకి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు పి.రాము శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఎన్‌టిఆర్ జిల్లా జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, సహాయ ఎన్నికల అధికారిగా ఇసి మెంబర్ బి.గోపాలక్రిష్ణ వ్యవహరించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్నికలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయని తెలిపారు. ఎన్నికల అనంతరం సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సభలో రాష్ట్ర అధ్యక్షుడు బి.రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు పాల్గొనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామాంజనేయ ఋషి

ప్రజాశక్తి-మార్కాపురం



జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మార్కాపురం మండలం వేములకోట గ్రామానికి చెందిన గోపిశెట్టి రామాంజనేయ ఋషి నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీలూరి రుషింగప్ప నియామక ఉత్తర్వులను శుక్రవారం జారీ చేశారు. ఈ సందర్భంగా రామాంజనేయ ఋషి మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేతల సమస్యలపై పనిచేస్తానన్నారు.

డాక్టర్ వైఎస్ఆర్ కృషితో...

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు : అన్నా

ప్రజాశక్తి-మార్కాపురం

విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులకు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి చేసిన కృషి ఫలితమేనని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు తెలిపారు. మార్కాపురం సమీపంలోని దేవరాజుగట్టు వద్దగల కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో వార్షికోత్సవ వేడుకలు గురువారం రాత్రి కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ అన్నా క్రిష్ణ చైతన్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నా వెంకటరాంబాబు మాట్లాడుతూ 2004లో సిఎంగా డాక్టర్ వైఎస్ఆర్ బాధ్యతలు చేపట్టారని, అప్పటి నుంచి విద్యా వ్యవస్థ అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఫీజు రియంబర్స్‌మెంట్ పథకంతో ఉన్నత విద్య ఉచితంగా పేద విద్యార్థులకు అందిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏ1 గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ ఎం.షంషీర్ అలీబేగ్, ఇందిరా ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్, డిఎస్‌పి డాక్టర్ ఎం.కిషోర్‌కుమార్, సిఐ. ఎం.భీమా నాయక్, పెద్దారవీడు ఎస్ఐ పులి రాజేష్, పట్టణ, రూరల్ ఎస్ఐలు ఎ.శశికుమార్, ఆర్.సుమన్, డాక్టర్ షేక్ మక్బుల్ బాషా, సామాజిక ఉద్యమకారులు షేక్ నజీర్ అహమ్మద్, ప్రముఖ ఆడిటర్ తోట సత్యనారాయణ, క్విట్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.కష్ణారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు

ఆహార భద్రత గ్యారెంటీ కల్పించాలి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

వ్యవసాయ కార్మికులకు, నిరుపేదలకు, పేద రైతులకు, నిరుద్యోగులకు ఆహార భద్రత గ్యారెంటీ కల్పించి ఆదుకోవాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బడుగు వెంకటేశ్వర్లు కోరారు. మండల పరిధిలోని తురకపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో కూలీలకు హాని కల్పించే నిర్ణయాలను ప్రభుత్వం ఎలా అమలు చేస్తుందో వివరించారు. ఉపాధి గ్యారంటీ ఆహార భద్రత, గ్యారెంటీ కోసం గతంలో అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించినట్లు తెలిపారు. ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని కోరుతూ చేపట్టే పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధి మేట్లు కనకరాజు, తిరుపతయ్య, నారాయణ, మేకల శ్రీను, తాడికొండల వెంకటరెడ్డి, మురళి, ఎస్‌కె.ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.



కూలీలతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలి

విహెచ్‌ఆర్ విద్యా సంస్థల అధినేత హనుమారెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

తమ కళాశాలలో చదివిన విద్యార్థులు ఎక్కడ ఉన్నా... ఉన్నతంగా రాణించాలని విహెచ్‌ఆర్ విద్యాసంస్థల చైర్మన్ వెన్నా హనుమారెడ్డి ఆకాంక్షించారు. తమ కళాశాలలో చదివే విద్యార్థి భవిష్యత్ బాగుండాలని తాను విహెచ్‌ఆర్ విద్యా సంస్థలను స్థాపించినట్లు ఆయన చెప్పారు. చైతన్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో నాల్గవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు గురువారం వీడ్కోలు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి అభివృద్ధి కోసం నాణ్యమైన విద్యను అందించేందుకు తమవంతుగా రాజీలేని కృషిని సాగించామన్నారు. ఈ కార్యక్రమంలో ఇందిరా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషా ఈశ్వరన్, ధార్వి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపల్ తులసి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెన్నా హనుమారెడ్డి

మేడేను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని (మేడే)ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బడుగు వెంకటేశ్వర్లు కోరారు. మేడేను జయప్రదం చేయాలని కోరుతూ హనుమంతునిపాడులో ఉద్యోగ, కార్మిక సంఘాలు సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మే1న మేడే వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో ఉద్యోగ సంఘాలు, కార్మిక సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్కీం వర్కర్లు, ఔట్సోర్సింగ్, రోజువారి వేతన కార్మికులు, గౌరవ వేతన కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వర్‌రెడ్డి, సిహెచ్.ఏసు, ఎపి అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు వై.రాధమ్మ, విఒఎల సంఘం కమిటీ సభ్యులు బ్యులా, డివైఎఫ్ఐ మండల నాయకుడు కొమ్మల చిన్నరామయ్య తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నైట్ వాచ్‌మెన్ ఎంపిక వాయిదా

ప్రజాశక్తి-పిసిపల్లి

మండలపరిధిలోని పెదఇర్లపాడు జడ్‌పిహెచ్‌ఎస్ నైట్ వాచ్‌మెన్ ఎంపిక శనివారానికి వాయిదాపడింది. నైట్‌వాచ్‌మెన్ పోస్టు కోసం ముగ్గురు దరఖాస్తు చేసుకున్నట్లు ప్రధానోపాధ్యాయులు జి.అనురాధ తెలిపారు. పేరెంట్స్ కమిటీ మెజారిటీ సభ్యుల తీర్మాణంతో వాచ్‌మెన్‌ను ఎంపిక చేయాల్సి ఉంది. పేరెంట్స్ కమిటీ సభ్యులు అందరూ అందుబాటులో లేకపోవడంతో ఎంపిక వాయిదా వేసినట్లు అనురాధ తెలిపారు. పేరెంట్స్ కమిటీ మెజార్టీ సభ్యుల ఆమోదంతో శనివారం వాచ్‌మెన్‌ను ఎంపిక చేయనున్నట్లు ఆమె తెలిపారు.

గ్రూపుల పోరువల్లే వాయిదా

పెదఇర్లపాడు జడ్‌పిహెచ్‌ఎస్ నైట్ వాచ్‌మెన్ ఎంపిక అధిక పార్టీలోని గ్రూపుల పోరు వల్లే వాయిదా పడినంది. పెదఇర్లపాడు, చింతగుంపల్లి, లక్ష్మక్కపల్లి పంచాయతీలోని వైసిపి నాయకులు మూడు గ్రూపులుగా విడిపోయారు. చట్టబద్ధంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు నియామకం జరగాలని ఓ గ్రూపు వారు కోరుతున్నారు. తమ ఆధిపత్యం సాగాలని మరో గ్రూపు వారు పట్టుబడుతున్నారు. దీంతో నైట్ వాచ్‌మెన్ ఎంపిక వాయిదా పడింది.

సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కును బాధిత కుటుంబానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శుక్రవారం అందజేశారు. పెద్దారవీడు మండలం దేవరాజుగట్టుకు చెందిన నందిరెడ్డి ధనలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 5 లక్షలు మంజూరయ్యాయి. సంబంధిత చెక్కును మంత్రి సురేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, త్రిపురాంతకం ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



సహాయనిధి చెక్కు అందజేస్తున్న మంత్రి

అర్హులకు ఓటు హక్కు కల్పించాలి

ప్రజాశక్తి-మద్దిపాడు

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని ఎన్నికల రిటరింగ్ అధికారి ఎస్. వరకుమార్ బిఎల్‌ఒలను ఆదేశించారు. తహశీల్దారు కార్యాలయంలో బిఎల్‌ఒలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరకుమార్ మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో డబల్ ఏంటరీ ఉండరాదని తెలిపారు. మృతిచెందిన ఓటర్ల పేర్లను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు జి. రజని కుమారి, డిటీ వెంకటేశ్వరరావు అసిస్టెంట్ ఎన్నికల అధికారి బొంతా మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల దీక్షకు టిడిపి సంఘీభావం

ప్రజాశక్తి-చీరాల

చేనేత రక్షణ, చేనేత ఉత్పత్తులకు మార్కెట్, చేనేత కార్మికులకు పని దినాల కోసం గత ఐదు రోజులుగా చీరాల మండలం జాండ్రపేటలో చేపట్టిన చేనేత కార్మికుల రిలే నిరాహార దీక్షకు టిడిపి చీరాల నియోజకవర్గ నాయకులు సజ్జ వెంకటేశ్వరరావు సంఘీభావం తెలిపారు. చేనేత వృత్తి రక్షణ కోసం గతంలో ఉన్న అనేక పథకాలను వైఎస్సార్ ప్రభుత్వం రద్దు చేసిందని అన్నారు. రంగులు, రసాయనాలపై సబ్సిడీ, యారన్ సబ్సిడీ, ఆప్కో ద్వారా చేనేత ఉత్పత్తుల కొనుగోలుకు నిధుల కేటాయింపు వంటి పథకాలు రద్దు చేయడంతో చేనేత వస్త్రాల ఉత్పత్తి ఖరీదు పెరిగి కొనుగోలు పడిపోయాయని అన్నారు. దీనితో మాస్టర్ వీవర్ల వద్ద పెద్ద ఎత్తున ఉత్పత్తులు నిల్వ ఉండి కార్మికులకు పని చూపే పరిస్థితి లేదన్నారు. నిరంతరం కార్మికులకు పని దొరకాలంటే చేనేత ఉత్పత్తి ఖర్చు తగ్గించే విధంగా గతంలో ఉన్న సబ్సిడీ పథకాలను అమలు చేయాలని, చేనేత వృత్తి రక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. చేనేత జన సమాఖ్య ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో గుత్తి శివయ్య, సజ్జ రవికుమార్, జాగాబత్తిన పోతురాజు, సజ్జ కోటేశ్వరరావు, బొడ్డు రవికుమార్, బొడ్డు శ్రీనివాసరావు, మెట్ల వెంకటసుబ్బారావు పాల్గొన్నారు.



దీక్షలో మద్దతు తెలుపుతున్న సజ్జా వెంకటేశ్వర్లు



గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

వైసిపితోనే సంక్షేమాభివృద్ధి: ఎమ్మెల్యే మద్దిశెట్టి

ప్రజాశక్తి-దరిశి

వైసిపి ప్రభుత్వంలోనే సంక్షేమాభివృద్ధి జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం దరిశిలోని ఇస్లాంపేటలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. భవిష్యత్‌లో కూడా జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఇక్కడ ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ వైవి సుబ్బయ్య, మండల కన్వీనరు వెన్నపూస వెంకటరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టరు కుమ్మిత అంజిరెడ్డి, కౌన్సిలర్లు విసిరెడ్డి, మోహన్‌రెడ్డి, కమీషనరు మహేష్, నాయకులు జయసింహ, నారాయణరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మోహన్‌రావు కుటుంబ సభ్యులకు 'వరికూటి' పరామర్శ

ప్రజాశక్తి-టంగుటూరు

మండల పరిధిలోని కారుమంచి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మతి చెందిన దోనెంపూడి మోహన్ రావుకుటుంబ సభ్యులను వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు పరామర్శించారు. మోహన్‌రావు దశ దిన కర్మ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరికూటి అశోక్‌బాబు పాల్గొని మోహన్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వరికూటి అశోక్‌బాబు రక్తసంబంధీకులు పాల్గొన్నారు.



తన రక్తసంబంధీకులతో వరికూటి అశోక్ బాబు

30న వీరబ్రహ్మేంద్ర స్వాముల ఆరాధన

ప్రజాశక్తి-అద్దంకి

అద్దంకి పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పొన్నపల్లి బ్రహ్మానందం అధ్యక్షతన జరిగిన సమావేశంలో 30వ తేదీన జరుగు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి 330 ఆరాధన మహోత్సవ ఆహ్వాన పత్రికను అద్దంకి కాకాని పాలెంలో బ్రహ్మంగారి దేవాలయంలో ప్రకాశం జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘ అధ్యక్షులు చెన్నుపల్లి శ్రీనివాసాచారి, బాపట్ల జిల్లా ప్రధాన కార్యదర్శి మునగంటి నరసింహాచారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. 30న ఉదయం 8 గంటల నుంచి ప్రత్యేక పూజలు ఏర్పాటు చేసి స్వామివారి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేస్తారన్నారు. భక్తులు అందరూ హాజరై తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు మండలం మల్లవరం గ్రామంలో మే 7న జరుగు ప్రసన్న వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవ సందర్భంగా విశ్వ బ్రాహ్మణ అన్నదాన సత్రంలో విశ్వబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక కార్యక్రమం, అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు అత్తలూరి హనుమంతరావు, ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారి విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్ర అధ్యక్షులు మల్లవరపు నటరాజ్, ఆళ్లగడ్డ వీర సుందరాచారి మిద్దెబోయిన ఆంజనేయులు, చెన్నుపల్లి కోటిలింగాచారి, బిజెపి ఆర్టిజన్ సెల్ రాష్ట్ర కన్వీనర్ కొండముది బంగారు బాబు, చోడ వెంకట సుబ్బారావు, సిద్ది హరికృష్ణ, అద్దంకి రమేష్, సిద్దు హనుమాచారి, పామర్తి సుబ్బారావు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి: ఎమ్మెల్యే కరణం

ప్రజాశక్తి-చీరాల

నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతంగా నాణ్యతతో పూర్తిచేయాలని ఎమ్మెల్యే కరణం బలరామ కృష్ణ మూర్తి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పలు శాఖ అధికారులతో ఇంజనీరింగ్ విభాగ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, గడప గడపకూ మన ప్రభుత్వం, సీఎండీఎఫ్, సాధారణ నిధులకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. కమిషనర్ రామచంద్రారెడ్డి, డిఇ ఏసయ్య, వైస్‌చైర్మన్ బాబు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం

చలివేంద్రాన్ని ప్రారంభించిన కరణం వెంకటేష్

ప్రజాశక్తి-చీరాల

బాపట్ల జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు సల్లూరి అనిల్ ఆయన తాతయ్య, నాయనమ్మ జ్ఞాపకార్థంగా కారంచేడు రైల్వే గేటు సెంటర్లో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ బాబు హాజరై ప్రారంభించారు. గత కొద్దిరోజులుగా ఎండలు తీవ్రత ఎక్కువగా ఉన్నవి అందరూ జాగ్రత్తగా ఉండి చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కంప అరుణ్, కీర్తి వెంకట్రావు, బొత్తుల అనిల్, గొట్టిపాటి ఎబినేజర్, సచివాలయం కన్వీనర్లు కందుల రవి, పిల్లి బాబు, కొప్పోలు కిరణమయి, నాయకులు కోండ్రు బాబ్జి, దారా రాజారావు, కంచర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

36 హెక్టార్లలో ఉద్యానవన పంటలకు నష్టం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ఇటీవల కురిసిన వర్షాలకు ఉద్యాన వనపంటలకు 36 హెక్టార్లలో నష్టం వాటిల్లినట్లు ఉద్యానవన శాఖ అధికారి ఆదిరెడ్డి తెలిపారు. యర్రగొండపాలెం మండలంలో 12 హెక్టార్లలో అరటి, 10 హెక్టార్లలో బొప్పాయి, 14 హెక్టార్లలో నిమ్మ పంటకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. త్రిపురాంతకం మండలంలోని విశ్వనాథపురం, వెల్లంపల్లి గ్రామాల్లో 187 ఎకరాల్లో కోతకు వచ్చి వరి నేలకొరినట్లు ఎఓ కె నీరజ తెలిపారు. దెబ్బతిన్న వరి నష్టాన్ని ప్రాథమికంగా అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు ఎఓ తెలిపారు.

ఇంటర్ ఫలితాలలో విజ్ఞాన్ ప్రభంజనం

ఎంఎల్‌టి విభాగంలో టౌన్ ఫస్ట్, సెకండ్ నర్సింగ్‌లో టౌన్ ఫస్ట్ సాధించిన విద్యార్థులు

ప్రజాశక్తి-రేపల్లె

ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలలో విజ్ఞాన్ ఒకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని ప్రిన్సిపల్ సాజిద్ బాషా తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విజ్ఞాన్ ఒకేషనల్ కళాశాల స్థాపించిన నాటి నుంచి నేటి వరకు గత15 సంవత్సరాలుగా అనేకసార్లు రాష్ట్ర స్థాయి లోను, జిల్లా స్థాయిలోనూ ఉత్తమ ఫలితాలు సాధించామని చెప్పారు. ప్రస్తుత ఫలితాలలో ద్వితీయ సంవత్సరం మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ విభాగంలో మొత్తం 40 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 36 మంది మంచి ఫలితాలు సాధించారని తెలిపారు. జుబేరియా సుల్తానా 1000 మార్కులకు 934 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్, ఎన్ వెంకటేశ్వరమ్మ 920 మార్కులతో టౌన్ సెకండ్, నర్సింగ్ విభాగంలో 923 మార్కులతో సాత్విక టౌన్ ఫస్ట్ సాధించారని తెలిపారు. ప్రథమ సంవత్సరం ఫలితాలలో 500 మార్కులకు ఎంఎల్‌టి విభాగంలో అనిల్ 447 మార్కులతో టౌన్ ఫస్ట్, నర్సింగ్‌లో భవ్య 449 మార్కులతో టౌన్ ఫస్ట్ సాధించారని తెలిపారు. ఈ మేరకు కళాశాల సిబ్బందికి, విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు.

కెఆర్‌కెలో పుస్తక ప్రదర్శన

ప్రజాశక్తి-అద్దంకి

సింగరకొండ కట్ట రామకోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో మే 1వ తేదీన పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పుస్తక ప్రదర్శనలు ఇటీవల ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై డిగ్రీ చేరబోయే విద్యార్థులకు ఉపయోగపడుతుందని గ్రంథాలయ అధ్యాపకులు డాక్టర్ జి శివప్రసాద్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా భీమా లీలాకృష్ణ

ప్రజాశక్తి-బాపట్ల



బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా ప్రముఖ సీనియర్ న్యాయవాది భీమా లీలాకృష్ణ ఎన్నికయ్యారు. శుక్రవారం జరిగిన బాపట్లబార్ అసోసియేషన్ ఎన్నికలు హెూరాహెూరీగా సాగాయి. భీమా లీలా కృష్ణ 8 ఓట్ల మెజారిటీతో త్రిముఖ పోటీలో గెలుపొందారు. పలువురు న్యాయవాదులు లీలా కృష్ణను అభినందించారు.

ఎస్ఐకి ప్రశంసాపత్రం

ప్రజాశక్తి-దరిశి

దరిశి సర్కిల్ పరిధిలో భారీ చోరీ ఛేదింపు కేసులో తాళ్లూరు ఎస్ఐ ప్రేమ్‌కుమార్ కీలకపాత్ర అని జిల్లా ఎస్‌పి మల్లిక గర్గ్ అన్నారు. శుక్రవారం దరిశి డిఎస్‌పి నారాయణస్వామిరెడ్డితో కలిసి ఎస్ఐ ప్రేమ్‌కుమార్ జిల్లా ఎస్‌పి మల్లికాగర్గ్ నుంచి ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌పితో పలువురు పోలీసు సిబ్బంది ఎస్ఐ ప్రేమ్‌కుమార్‌ను అభినందించారు.

చెత్తకేంద్రాన్ని సందర్శించిన డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-దరిశి

పారిశుద్ధ్య కార్మికులు ఎప్పటికప్పుడు చెత్తను తీసివేసి చెత్తసంపద కేంద్రానికి తరలించాలని డిఎల్‌పిఒ గుత్తా శోభన్‌బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని తూర్పు వెంకటాపురం గ్రామంలో చెత్తసంపద కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్, ఆశా, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

'ఆదర్శ'లో గ్రాడ్యుయేషన్ డే సంబరాలు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఇంకొల్లు ఆదర్శ లిటిల్ చాంప్స్ గ్రాడ్యుయేషన్ డే సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రముఖ వైద్యులు గోరంట్ల విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను అభినందించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆట పాటలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తోటకూర విజయభాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ స్థాయి సమావేశం

ప్రజాశక్తి-భట్టిప్రోలు/అమృతలూరు

కొల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 గంటలకు వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం జరుగుతుందని భట్టిప్రోలు ఎంపిడిఓ సత్యనారాయణ, ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలు తీరు, లబ్ధిదారుల స్థితిగతులపై జిల్లా, మండల స్థాయి అధికారులతో సమీక్షిస్తారని, ఆయా శాఖల అధికారులు అవసరమైన రికార్డులతో హాజరు కావాలని కోరారు.

బాలింతల పేర్లు ఆన్‌లైన్లో నమోదు చేయాలి

ప్రజాశక్తి-బల్లికురవ రూరల్

గర్భిణులు, బాలింతల నమోదు ఆన్‌లైన్లో కచ్చితంగా చేసి ఉంచాలని డిపిఓ ప్రోగ్రాం ఆఫీసర్ ప్రేమపావని తెలిపారు. శుక్రవారం గుంటుపల్లి పిహెచ్‌సిలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, అన్ని రకాల సర్వీసులు పకడ్బందీగా నాణ్యమైన సేవలు అందించేందుకు ప్రతి ఆరోగ్య కార్యకర్త కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి సర్వీసును ఆన్‌లైన్లో పొందుపరిచేలాగా చర్యలు తీసుకోవాలని మెడికల్ ఆఫీసర్‌కు తెలియజేశారు.

చివరి క్వార్టర్ బిల్లులే రావాలి

ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ వైద్య సేవలందిస్తున్న నెట్ వర్క్ హాస్పిటల్స్‌కు చివరి క్వార్టర్ బిల్లులే రావాల్సి ఉందని ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ప్రజాశక్తి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'ఆరోగ్యశ్రీ బకాయిలు ఎప్పుడిస్తారో.?' కథనానికి ఆయన వివరణ ఇచ్చారు. నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు రావాల్సిన బకాయిలు 2023 జనవరి వరకు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ చెల్లించిందని, చివరి క్వార్టర్ బకాయిలు మాత్రమే రావాల్సి ఉందన్నారు. నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు రావాల్సిన చివరి క్వార్టర్‌కి బకాయిలు ఆరోగ్య ట్రస్ట్ చెల్లించాల్సి ఉందన్నారు. వీటిని కూడా సిఎస్ఎంఎఫ్ ద్వారా చెల్లించేందుకు డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఏర్పాట్లు చేస్తుందన్నారు. అదేవిధంగా మే ఒకటి నుంచి వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తున్నట్లు అధికారికంగా నెట్‌వర్క్ హాస్పి టల్స్ అసోసియేషన్ నుంచి గానీ, ఏ నెట్‌వర్క్ హాస్పిటల్ నుంచి గానీ వినతిపత్రం రాలేదని ఆయన తెలియజేశారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి: జేసీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వాహనదారులు రహదారి భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చూడాలని సంయుక్త కలెక్టర్ కె. శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. ఆయన అధ్యక్షతన కలెక్టరేట్ లోని స్పందన హాలులో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో డిటిసి బి. చందర్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బేబీరాణి, డిసిహెచ్ఎస్ ఎస్.ఎన్. మూర్తి, రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.భగవాన్ నాయక్, ఆర్టీసి ఆర్ఎం సుధాకర్, రిమ్స్ ఆర్ఎంఒ చైతన్య, ట్రాఫిక్ డిఎస్‌పి వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రికి అండగా నిలవాలి

జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ



వృద్ధురాలితో మాట్లాడుతున్న బూచేపల్లి వెంకాయమ్మ

ప్రజాశక్తి-చీమకుర్తి

రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి అండగా నిలవాలని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కోరారు. శుక్రవారం మండలంలోని బండ్లమూడిలో జరిగిన గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె ఎమ్మెల్యే టిజెఆర్. సుధాకరబాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా?లేదా? అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి యద్దనపూడి శ్రీనివాసరావు, జడ్‌పిటిసి వేమా శ్రీనివాసరావు, వైసిపి మండల అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, కె శేఖరరెడ్డి, ఎంపిటిసి వై విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ వై శేషిరెడ్డి, సర్పంచ్ పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సత్య శ్రీనివాసులు



సత్య శ్రీనివాసులు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు బార్ అసోషియేషన్ అధ్యక్షునిగా నల్లూరి సత్యశ్రీనివాసులు ఎన్నికయ్యారు. అసోషియేషన్ ఎన్నికలు శుక్రవారం కోర్టు ప్రాంగణంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో అసోషియేషన్ అధ్యక్షునిగా నల్లూరి సత్యశ్రీనివాస్ 118 ఓట్ల మెజారిటితో గెలుపొందారు. ఉపాధ్యక్షునిగా నాయుడు ఈశ్వరరావుపై షేక్ ఉస్మాన్ సాహెబ్ 44 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. కార్యదర్శిగా దువ్వూరి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సహాయ కార్యదర్శిగా నాగిశెట్టి సాంబశివరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గ్రంథాలయం సెక్రటరీగా పాలవెల్లి సంజీవరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహిళా రిప్రజంటేటివ్‌గా గ్రేస్‌కుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మొత్తం 835 మంది ఓటర్లకు గానూ 660 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎన్నికల అధికారులుగా డిఎస్‌కె చక్రవర్తి, పివి శ్రీనివాస్ గుప్తా, షేక్ చందాని, బి శ్రీనివాసరావు వ్యవహరించారు.

కుక్కల నియంత్రణకు చర్యలు

- ఆపరేషన్లకు థియేటర్ నిర్మించాలి - ఒఎంసి స్టాండింగ్ కమిటీ సమావేశం తీర్మానం



మాట్లాడుతున్న మేయర్ సుజాత

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో కుక్కల నియంత్రణ కోసం కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించాలని, ఇందుకోసం నగరపాలకసంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఆపరేషన్ ధియోటర్ నిర్మించాలని నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ సమావేశం తీర్మానించింది. మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశం శుక్రవారం మేయర్ ఛాంబర్‌లో జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మాట్లాడుతూ కుక్కలకు కుటుంబనియంత్రణ ఆపరేషన్ చేయించేందుకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. పర్యవసానంగా అనుకున్న లక్ష్యాలు నెరవేరడం లేదని చెప్పారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటు చేసి, పశుసంవర్ధశాఖ ఆధ్వర్యంలో ఒక డాక్టర్‌ను ఏర్పాటు చేస్తే కుక్కల నియంత్రణకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఇందుకు కమిటీ సభ్యులు ఆమోదం తెలిపారు. వెంటనే ఆపరేషన్ థియేటర్ నిర్మించాలని తీర్మానించారు. ఇంకా నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్టాండింగ్ కమిటీ సమావేశం ఆమోదం తెలిపింది. సమావేశంలో కమిటీ సభ్యులు ఈదర వెంకట సురేష్ బాబు (చిన్నారి), తాడి కృష్ణలత, గోలి లక్ష్మీ కోటేశ్వరమ్మ, ఇమ్రాన్‌ఖాన్, జడా వెంకటేష్, కౌన్సిల్ మెంబర్ వర్ధు శేషయ్య, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ వీరాంజనేయులు, ఇంజినీర్ కె మాల్యాద్రి, హెల్త్ ఆఫీసర్ మనోహర్‌రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ ఎన్.పిచ్చయ్య పాల్గొన్నారు.

తెలుగు రాష్ట్రాలకు బిజెపి ప్రమాదం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు



మాట్లాడుతున్న మాబు

ప్రజాశక్తి-చీమకుర్తి

తెలుగు రాష్ట్రాలకు బిజెపి ప్రమాదం పొంచి ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు పేర్కొన్నారు. మండలంలోని కెవి పాలెంలో జరిగిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు-ప్రభావాలు అనే అంశంపై జరిగిన సభలో ఆయన మాట్లాడారు. సభకు బెజవాడ శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎస్‌కె.మాబు మాట్లాడుతూ విశాఖ ఉక్కును, ఇతర ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ అంబానీ, అదానీలకు కట్టబెడుతున్నారన్నారు. ప్రశ్నించిన వారిని సిబిఐ, ఈడి, కోర్టులను ప్రభావితం చేసి.. జైలుకు పంపుతున్నారన్నారు. వైసిపి, టిడిపి, జనసేన బిజెపి సంకలో పిల్లుల్లా ఉంటూ తెలుగు ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. బిజెపి విధానాలను అందరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు పమిడి వెంకటరావు, మండల కార్యదర్శి పూసపాటి వెంకటరావు, సిపిఎం గ్రామ కార్యదర్శి పొత్తూరి సురేష్ మాట్లాడారు. కార్యక్రమంలో కొల్లూరి వెంకటేశ్వర్లు, నల్లూరి కృష్ణయ్య, దర్శి సుధాకర్, పమిడి రామారావు, రావూరి వెంకటరావు, మాదాల నరసింహారావు, నరసింహారావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అనాథ బాలల కోసమే 'వాత్సల్య'

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి



మాట్లాడుతున్న పద్మావతి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

తల్లిదండ్రులను కోల్పోయిన, నిరాదరణకు గురైన, నిరాశ్రయులు, నిస్సహాయ అనాథ బాలలను ప్రభుత్వం గుర్తించి.. 'మిషన్ వాత్సల్య' పథకం ద్వారా ప్రతి నెలా రూ.నాలుగు వేల చొప్పున ఆర్థిక భరోసా కల్పించడం జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. స్థానిక ఎస్సీ, బీసీ కాలనీలో మార్కాపురం డివిజన్ పరిధిలోని సీడీపీఓలు, తహశీల్దార్, ఎంపీడీవోలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పద్మావతి మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా మిషన్ వాత్సల్య పథకానికి 13210 దరఖాస్తులు వచ్చాయని, ఇంకా వస్తున్నాయని, ఒంటరి మహిళల పిల్లలు, పాక్షిక అనాథ పిల్లలకు ధ్రువీకరణ పత్రాలు త్వరితగతిన అందించాలని తహశీలార్లు, జనన ధ్రువీకరణ పత్రాలు ఎంఈఓలు అందించాలని ఆదేశించారు. పిల్లలకు ఆధార్ కార్డులు లేకపోయినా సంరక్షకుల ఆధార్ కార్డులతో దరఖాస్తులు స్వీకరించవచ్చని, తల్లితండ్రి ఇద్దరూ చనిపోయిన వారి పిల్లలకు రేషన్ కార్డు లేకపోయినా వారి సంరక్షకుని యొక్క రేషన్‌కార్డుతో వారి దరఖాస్తులను స్వీకరించవచ్చన్నారు. రాష్ట్రంలో బాలల యొక్క రక్షణ మరియు సంరక్షణ దృష్టిలో పెట్టుకొని ఈ పథకం గురించి విస్తృతంగా ప్రచారం చేస్తూ.. రాష్ట్రమంతా అవగాహన కార్యక్రమాలని చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామ/వార్డ్ స్థాయి లో గల సచివాలయం, ఉపాధ్యాయ, అంగన్వాడి సిబ్బంది, వాలంటీర్లు, బాలల కోసం పనిచేస్తున్న ఇతర సిబ్బంది ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. అర్హులైన వారందరు ఈ నెల 30వ తేదీ లోపు దరఖాస్తులను సంబంధిత అధికారులకు అందజేస్తే వాటిని మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆధ్వర్యంలో పరిశీలించి అర్హత కలిగిన లబ్ధిదారుల యొక్క వివరాలను రాష్ట్ర స్థాయి అధికారులుకు మంజూరు కోసం సమర్పించడం జరుగుతుందన్నారు. అనంతరం మార్కాపురం పట్టణ పరిధిలోని పలు సచివాలయాలను సందర్శించి, బడి బయట పిల్లలు గుర్తించి వారిని బడిలోకి చేర్పించాలని ఎడ్యుకేషన్ సెక్రెటరీ, మహిళా పోలీసులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు జె.రాజేంప్రసాద్, డిప్యూటీ డీఈవో చంద్రమౌళీ, మార్కాపురం ఇన్‌ఛార్జీ తహశీల్దార్ హరిబాబు, మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, మార్కాపురం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ భీమా నాయక్, రెండవ పట్టణ ఎస్సై సువర్ణ పాల్గొన్నారు.



సచివాలయాల సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

సచివాలయాల తనిఖీ

విధులకు హాజరు కాని సిబ్బందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

నగరంలోని సుజాతనగర్, గాంధీనగర్, శివప్రసాద్ కాలనీ సచివాలయాలను కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరుపట్టీలను పరిశీలించారు. సచివాలయ విధులకు హాజరు కాని సిబ్బందికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటి పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యంగా ఉన్న గాంధీనగర్ సచివాలయ అడ్మిన్ సెక్రటరీకి సోకాజ్ నోటీసు జారీచేశారు. సచివాలయ పరిధిలో నిర్మాణంలో ఉన్న భవనాలకు అనుమతులు ఉన్నాయో.? లేదో.? పరిశీలించి అనుమతులు లేని భవన యజమానులకు నోటీసులు జారీ చేయాలని వార్డు ప్లానింగ్ సెక్రటరీలకు సూచించారు. సచివాలయ విధులకు హాజరు కాని గాంధీనగర్ సచివాలయ ప్లానింగ్ సెక్రటరీకి చార్జ్ మెమో ఇవ్వాలని ఆదేశించారు. సచివాలయల పరిధిలో జరుగుతున్న శానిటేషన్ పనులపై సిబ్బందితో చర్చించారు. వాలంటీర్లు సచివాలయ విధులలో భాగస్వాములు కాని ఎడల వారిని విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. గాంధీనగర్ సచివాలయం పరిధిలో క్లాప్ ఆటో సక్రమంగా రావడం లేదని ఫిర్యాదులు వచ్చాయని, యూజర్ చార్జీలు తక్కువగా వసూలు చేశారని, అందుకు గాను సంబంధిత శానిటరి సెక్రటరీకి చార్జ్‌మెమో ఇవ్వాలని ఆదేశించారు. క్లాప్ ఆటో ఎందుకు రావడం లేదనే విషయం విచారించి రిపోర్టు ఇవ్వాలని శానిటరి ఇన్స్‌పెక్టర్ బాబ్జీకి సూచించారు. శివప్రసాద్ కాలనీ సచివాలయంలో సచివాలయ సిబ్బంది మధ్యాహ్నం నుంచి విధులకు రావడం లేదని ఫిర్యాదులు వచ్చాయని కమిషనర్ తెలిపారు. దీనిమీద ఆయన సంబంధిత సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది మొత్తం రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. మరోసారి ఫిర్యాదు వస్తే శాఖపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గాంధీనగర్ సచివాలయ డేటా ప్రాసెసింగ్ సెక్రటరి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరు కావడంతో సంబంధిత సెక్రటరీకి చార్జ్‌మెమో ఇవ్వాలని ఆదేశించారు. ప్రతి సచివాలయం పరిధిలో రోజుకు 30కి తగ్గకుండా ప్రజలకు సర్వీసెస్ అందించాలని కమిషనర్ చెప్పారు. అలా అందించని 29 మంది సచివాలయ సిబ్బందికి ఇప్పటి వరకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగిందని కమిషనర్ తెలిపారు. కమిషనర్ వెంట 37వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్, 33వ డివిజన్ వైసిపి అధ్యక్షులు పెద్దిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

30 లోపు అభ్యంతరాలు తెలియజేయాలి

డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి -ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో వైద్య, ఆరోగ్య శాఖలో వివిధ పోస్టులకు సంబంధించిన ప్రొవిజనల్ లిస్ట్ వెబ్‌సైట్‌లో ఉంచామని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 30 లోపు తెలియజేయాలని డిఎం,హెచ్‌ఒ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్ఎం కార్యక్రమంలో డిఇఐసి(ఆర్‌బిఎస్‌కె), ఎన్ఎంహెచ్‌పి హెల్త్ ప్రోగ్రాంలో ఖాళీగా ఉన్న సైకియాట్రిస్ట్, సోషల్ వర్కర్(ఎన్ఎంహెచ్‌పి), న్యూట్రిషన్ కౌన్సిలర్(ఎన్ఆర్‌సి), ఆడియాలజిస్ట్, స్పీచ్‌థెరపిస్ట్, సోషల్ వర్కర్, ఆప్తమెట్రిస్ట్ ఉద్యోగాలకు మార్చి 29 నుంచి ఏప్రిల్ 3 వరకు నిర్వహించిన వాక్ ఇన్ ఇంటర్వ్యూలు ప్రొవిజనల్ లిస్ట్‌ను జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. అభ్యర్థులు వీటిని పరిశీలించి ఏవైనా అభ్యంరాలు ఉంటే ఈనెల 30వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు స్వయంగా ప్రకాశం భవనంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయంలో సమర్పించి.. తగిన రశీదు పొందాలన్నారు.